జులై 2018
రూ. 20

# చైతన్యం

సంకల్ప బలం

## సామాజిక విలువల మాసపత్రిక



2018 వరల్డ్ కప్ ఫుట్ బాల్ ఫైనల్ జులై 15 న




పూరీ రధయాత్ర  జూలై 14 న




గురుపూర్ణిమ  జూలై 27 న




# చైతన్యం

సంకల్ప బలం

సామాజిక విలువల మాస పత్రిక

సంపుటి -7 జూలై 2018 సంచిక -10



వ్యవస్థాపక సంపాదకురాలు:

తీగవరపు శాంతి


## ఈ సంచికలో

### ధారావాహికములు:


| | |
|---|---|
| ముల్లా నస్రుద్దీన్ కథలు | 14 |
| నేపాల్ యాత్ర | 20 |
| కాశీ ఖండం | 27 |
| సంభాషణ సంస్కృతం | 31 |
| మా ఊరి నందుల కథ | 35 |
| భారతీ'స్ కిచెన్ | 42 |
| ప్రహేళిక | 43 |
| రాశి ఫలాలు | 48 |


### ప్రత్యేక ఆకర్షణలు


| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| అభిప్రాయ వేదిక | 5 |
| చర్య ప్రతిచర్య | 6 |
| ఈ విశ్వం వయసు ఎంత | 9 |
| సంతాపమే సరైన మందు | 12 |
| ధ్వన్యనుకరణ సామ్రాట్ | 16 |
| శీర జయరాం | 22 |
| ఎన్ని కలలో..ఎన్నికలలో | 24 |
| మన విద్యా వ్యవస్థ | 29 |
| ఉచిత భోజన విద్యాలయాలు | 38 |
| జగన్నాథుని రథయాత్ర | 44 |



రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

## బడులంటే భారమనా? చదువంటే ఇదేనా?

బడులంటే భయ పడిపోతున్న తల్లితండ్రులు ఇవేం చదువులురా బాబూ! పిల్లలు ఏం నేర్చుకుంటున్నారో తెలియదుకానీ, ఆస్తిపాస్థులు అమ్ముకున్నా, చదివించలేక పోతున్నాం అని బెంబేలెత్తుతున్నారు తల్లితండ్రులు. ఇక ఆచదువులు ఎంత చదివినా, వేరే పిల్లలతో పోటీ పడి చదివి మార్కులు తెచ్చుకోలేక పిల్లలు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు.

హమ్మయ్య! బడులుతెరిచారు అనుకోవడానికి బదులు, అమ్మ బాబోయ్! బడులు తెరిచారు అని తల్లితండ్రులూ , పిల్లలూ కూడా బేజారెత్తి పోతున్నారు. ప్రయివేటు స్కూళ్ళు అయితే రకరకాల పేర్లు చెప్పి ఫీజుల రూపం లో వసూలు చేస్తుంటే, డబ్బులు కట్టలేక మధ్యతరగతి వారు చాలా ఇబ్బంది పడుతున్నారు. అలాగని గవర్నమెంట్ స్కూల్స్ కి పిల్లలను పంపుదామంటే అక్కడ ఉపాధ్యాయులే సరిగ్గా ఉండక బిల్డింగులు, కూర్చోవడానికి ఫర్నీచర్ చివరికి బాత్రూములు కూడా లేక ఇబ్బంది పడే పరిస్థితి. ఇంకా వింత చర్యలు ఏమంటే , ప్రభుత్వ విధానాలు అతివృష్టి, అనావృష్టి, పూర్వం బతకలేక బడిపంతులు అనేవారు . ఇప్పుడు వారి జీతాలు పెన్షన్లు విపరీతంగా పెంచిన ప్రభుత్వం స్కూలు అభివృద్ధికి మాత్రం పాటుపడడం లేదు అనేది ప్రజల ఆరోపణ. ప్రజల డబ్బు ఎక్కడ ఎంత ఖర్చు పెడితే ప్రజలకు ఎక్కువ ఉపయోగకరంగా ఉంటుంది ? అని ప్రభుత్వం ఆలోచించ వలసిన పని లేదా? అని కూడా ప్రజలు అనుకుంటున్నారు. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా విద్యా విధానంలో తగినన్ని మార్పులు తీసుకువచ్చి , విలువైన విద్యను అందివ్వలేక పోతున్నాయి. స్కూల్స్ లో ఎందుకు చైతన్యాన్ని తీసుకు రాలేక పోతున్నాయి? ఎన్నికలలో నెగ్గిన మరుక్షణమే ప్రజల డబ్బుతో ప్రపంచాన్ని చుట్టి వచ్చే రాజకీయ నాయకులు అక్కడ విద్యా విధానాలను ఎందుకు అమలు చేయలేక పోతున్నారు? తెలివైన విద్యార్థులంతా విదేశాలకు వెళ్లి చదువుకుంటాం అంటే మన దేశంలో అటువంటి విద్యా విధానాన్ని అందివ్వడానికి ప్రయత్నించడం పోయి, విదేశాలకు వెళ్లేందుకు తగిన ఆర్థిక సహాయాన్ని అందిస్తామనటం హాస్యాస్పదం కాదా ? మన దేశంలోని ప్రజల సొమ్మును ఖర్చు చేసి, విద్యార్థులను చక్కటి మేధావంతులుగా తయారు చేసి , విదేశాలకు వారి తెలివిని పంచి పెడుతున్నారే ? ఇదెంతవరకూ న్యాయం? ప్రభుత్వం ప్రభుత్వ స్కుల్ను అభివృద్ధి చేసి, ప్రజలను అటువైపు మరలేటట్టు చేసి, తెలివైన విద్యార్థులకు మన దేశంలోనే తగిన ప్రాతినిధ్యాన్ని కల్పించి వారిని మన దేశానికే ఉపయోగ పడేటట్లు చేస్తే, మన దేశం అభివృద్ధి చెందదా ? విదేశాలకు వెడుతున్న, వెళ్లిన వారినీ అడిగితే ఇదే మాట చెబుతున్నారు. మాకు తగిన ప్రాధాన్యత నిస్తే మా తల్లితండ్రులను వదిలి విదేశాలకు ఎందుకు వెడతాము? అంటున్నారు. ప్రజలకు అవసరాలు చాలా ఉన్నాయి. వాటికి సంబంధిన విద్యలు కూడా నేర్చుకుని విద్యార్థులు రాణిస్తే ఎంత బావుంటుంది? ఇటువంటి వన్నీ చేసి విద్యా విధానంలో మార్పులు తీసుకువచ్చి, వాటికి సంబంధించిన పని వారికి కల్పించ వలసిన బాధ్యత ప్రభుత్వం పై వుంది. ఆ విధంగా నిరుద్యోగ సమస్యను కూడా రూపుమాపవచ్చును కదా!. ఇక పోతే ఇటువంటి మార్పులు అన్నీ తీసుకు రావాలంటే ప్రముఖులతో చర్చ జరిపి, మార్పులు తీసుకు రావలసిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా స్కూల్స్ కి కాలేజీలకు వెళ్లే విద్యార్థులకు భద్రతకల్పించవలసిన అవసరం ఎంతైనా ఉంది. చదువులలో విదేశాలను పోల్చుకుంటారుకదా ? అక్కడ విద్యా విధానం, ముఖ్యం గా అమెరికా విద్యా విధానం గురించి ఆలోచిద్దాం: అమెరికాలో పిల్లల చదువు వారిని ఆలోచింప చేసేదిగా ఉంటుంది. అంతేకాని ఎక్కువగా పుస్తకాలలో ఉన్నది మాత్రమే చదివి , బట్టీ పట్టేటట్లుగా ఉండదు అంటారు. పిల్లలకు చిన్నప్పటినుండీ ఆలోచనా శక్తిని పెంచే ఆటలు ,, ఉదా : పజిల్స్, రక రకాల వీడియో గేమ్స్, రకరకాల ఆటలు , ఇలా చిన్నప్పటినుండీ వారిలో ఆలోచనా శక్తి పెరిగేటట్లుగా ఇటు తల్లితండ్రులూ , ఉపాధ్యాయులు ప్రయత్నిస్తూ ఉంటారు. అంతే కాదు మన దేశంలో అయితే ఆ క్లాసులో ఉన్న సబ్ జెక్ట్స్ లో ఎవరికి అత్యధిక మార్కులు వస్తే వారే మంచి మంచి స్కూల్స్ లో సీటు పొందడానికి అర్హులు. తరువాత వారు సోషల్ అవేర్నెస్ లేక చాలా ఇబ్బంది ఇబ్బంది పడుతూ ఉంటారు. ముఖ్యంగా విదేశాలకు వెళ్ళినప్పుడు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటారు. అమెరికాలో అయితే చదువుకి ఎంత ప్రాధాన్యతను ఇస్తారో, మిగిలిన ఎక్స్ట్రా యాక్టివిటీస్ కి కూడా అంత ప్రాధాన్యతను ఇస్తారు. సంగీత సాహిత్యాలలోను, ఇనుస్ట్రు మెంట్లు నేర్చుకోవడంలోనూ, డిబేట్స్లోను , ఆటల్లోను, సామాజిక కార్యకలాపాలలోను, ముఖ్యంగా పేదవారికి సహాయం చేయడం ఇటువంటివన్నీ నేర్చుకుని , చదువుతో పాటు వీటికి కూడా ప్రాధాన్యతను ఇస్తారు. ఈ అర్హతలన్నీ ఉంటేనే అమెరికాలో విద్యార్థులకు పెద్ద పేరున్న స్కూల్స్ లోను , యూనివెర్సిటీల్లోనూ అర్హత పొందుతారు. వారే పెద్ద పెద్ద పదవులు పొందే అవకాశం ఉంటుంది. అందుకే మన భారత దేశం నుండి వెళ్లిన విద్యార్థులు కూడా అన్నిటిలోను పాల్గొని ప్రావీణ్యాన్ని సంపాదిస్తున్నారు. ఇంతమంది రాజకీయ నాయకులు వేదేశాలను చుట్టి వస్తున్నారు కానీ ప్రజలకు ముఖ్యంగా విద్యార్థులకు, స్కూల్స్ కి , కాలేజీలకు పనికి వచ్చే పని ఎంత చేస్తున్నాం? అని ఆలోచించరు. త్వరలో అటు ప్రజల్లోనూ, ప్రభుత్వంలోనూ చైతన్యం వచ్చి అభివృద్ధి పథంలోకి దూసుకుకుపోతుంది మన దేశం అని ఆశిస్తోంది చైతన్యం సంకల్పబలం .



తీగవరపు శాంతి

# అభిప్రాయ వేదిక

మన రాష్ట్రంలో మనకేదీ ప్రాధాన్యత అంటూ వ్రాసిన సంపాదకీయం చక్కగా ఉంది. మన రెండు ప్రభుత్వాలూ లేవనెత్తవలసిన విషయం ఇది. నేతలలో కనువిప్పు కలుగుతుందని ఆశిద్దాం.

భానోజీరావు, విజయవాడ, నరసయ్య గౌడ్, సికింద్రాబాద్

అత్తా కోడళ్ల మధ్య యుగయుగాలుగా జరుగుతున్న ప్రచ్ఛన్నయుద్ధం గురించి కథ కానీ కథ లో చక్కగా వివరించారు. ఇది లోకరీతి అని వదిలేయటమే ఉత్తమం అనుకుంటాను .

సుబ్బారావు, సంధ్య - విశాఖపట్నం

నవలారాణి సులోచనారాణి గురించి పోడూరిగారి వ్యాసం బాగుంది. ఎన్నో తెలియని విషయాలు తెలియపరిచారు రచయిత.

శంభుప్రసాద్ - మల్కాజిగిరి

మీరు కొత్తగా మొదలుపెట్టిన ముల్లాకథలు మమ్మల్ని బాగా ఆకట్టుకున్నాయి. రచయితకు ధన్యవాదాలు.

రాజారావు, రాణి - హైదరాబాద్

ఈ విశ్వం వయస్సు ఎంత అంటూ వేమూరి గారు వ్రాసిన శీర్షిక అద్భుతంగా వుంది. చాలా బాగా విడమరిచి చెప్పారు రచయిత. ఆయనకు నమస్కారాలు.

హైమవతి, చందు - అనంతపురం

మీ పత్రిక ప్రారంభించినప్పటినుంచీ ఒక్క సంచిక కూడా వదలకుండా చదివిన పాఠకులలో నేనూ ఒకడిని. ఇందులోని మిస్ మేఘమాల సీరియల్ నాకు ఎంతో ఇష్టమైన శీర్షిక. చక్కటి కథ, మరింత చక్కటి కథనం కలిపి దీన్ని ఒక గొప్ప నవలగా నిలబెట్టాయి. దీన్ని నవలారాణి సులోచనారానికి అంకితమివ్వటం ఒక కోసం మెరుపు. ఈ సీరియల్ ఈ సంచికలో అయిపోయిందంటే కొంచెం బాధ వేసిందన్నమాట నిజం. నండూరి సరోజ గారి ఈ కథను ఎవరైనా సినిమాగా తీస్తే బావుణ్ణు. ఈ రచయిత్రి నుంచి మరొక మంచి నవల మేము ఆశించవచ్చా?

రత్నమాల, భారతి, వైదేహి, శ్రావణి, మృదుల, లక్ష్మి, సుబ్రహ్మణ్యం, ఆంజనేయులు, రత్నాజీ, నరసింహం, ప్రసాద్, సోమయ్య - హైదరాబాద్

దుర్గాప్రసాదరావు గారి సంస్కృత పాఠాలు చక్కగా సాగుతున్నాయి సంస్కృతం నేర్చుకోవటానికి మాకు ఇవి ఎంతగానో తోడ్పడుతున్నాయి. ఆయనకు మా ధన్యవాదాలు.

లక్ష్మణ్, రాజీ - వరంగల్

ఎలక్ట్రాన్ గారి కథ ఉచిత భోజన విద్యాలయాలు బాగుంది. కళ్ళకు కట్టినట్లుగా వర్ణించారు పరిస్థితిని రచయిత. ఆయనకు మా అభినందనలు.

రామస్వామి, వనజ - ముషీరాబాద్

ప్రహేళిక చాలా ఆసక్తికరంగా వుంది. ఈసారి సాల్వ్ చేద్దామని కొంత ప్రయత్నించా కానీ నావల్ల కాలేదు. ఈసారి ఇంకా గట్టిగా ప్రయత్నించాలి. మా మెదడుకు మంచి కసరత్తు ఇస్తోంది ఈ శీర్షిక.

తులసీరామ్, రామలక్ష్మి - లింగంపల్లి

బ్రహ్మదేవుడికి ప్రీతికరమైన మాసం నిజ జ్యేష్ఠ మాసం అంటూ చక్కగా వివరించారు కొత్త రామానందంగారు. ప్రతి నెల విశిష్టత గురించి ఎన్నో వివరాలు తెలియజెపుతున్నారు రచయిత. ఆయనకు మా ధన్యవాదాలు.

తేజస్విని, శకుంతల - ఏలూరు

రాశిఫలాలు బాగా వ్రాస్తున్నారు. కొన్నిసార్లు మాకు ఇది గైడెన్స్ గా పనిచేస్తోంది. జనార్దన్ ఠాగూర్ గారికి జ్యోతిషం లో ఉన్న పట్టు మాకర్థమవుతోంది.

రామ మాధవ్, షాలిని - నల్లకుంట

మా ఊరి నందుల కథ చాలా బాగుంటోంది. పల్లెటూళ్ళో మేము చిన్నప్పుడు గడిపిన రోజులు గుర్తుకొస్తున్నాయి.

ప్రతాప్, అనసూయ నెల్లూరు

పోచినపెద్ది మురళీకృష్ణ గారు వ్రాస్తున్న కాశీ ఖండం చదవటానికి ఎంతో బాగుంది.

వర్మ, రామ్మోహన్, పరమేశ్వర్ - హైదరాబాద్

# భువనచంద్ర



## యాక్షన్ - రియాక్షన్ (చర్య - ప్రతిచర్య)

"ఒక చిన్న టీ స్టాల్ లో పని చేశారు వారు. ఆ తరవాత మెల్లగా ఓ హోటలే లేని వూళ్ళోకి వెళ్లి, ఎంతో కష్టపడి ఓ టీ స్టాల్ పెట్టుకున్నారు. అక్కడే మెల్లగా బిస్కెట్లూ సిగరెట్ల వంటివి అమ్ముతూ కొన్నాళ్ళకి అదే ఊళ్లో ఓ పచారీ దుకాణం తెరిచారు. ఆ తరవాత టౌన్లో ఓ హోటలు, ఓ బట్టల షాపు, ఓ సూపర్ మార్కెట్టు తెరిచి గొప్ప వ్యక్తిగా పేరుపొందారు. ఆ తరవాత మూడు సినిమా హాళ్లు నిర్మించి, డిస్ట్రిబ్యూషన్ కూడా చేపట్టి నగర ప్రముఖులయ్యారు. ఓ ప్రొడ్యూసర్ చేసిన ఛాలెంజ్ ని ఎదుర్కొని వారే సినిమా తీయడం గాక సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ గా పేరొందారు. తరవాత డైరెక్టర్ గా, రచయితగా ప్రస్తుతం మన మంత్రివర్గంలో మంత్రిగా ఎదిగారు. యువత వారిని చూసి నేర్చుకోవలసింది ఎంతో వుంది, వారి అడుగుజాడలు విజయానికి మెట్లు అని నొక్కి వక్కాణిస్తూ సెలవు తీసుకుంటున్నాను" అంటూ హర్ష-



ధ్వానాల మధ్య, చప్పట్ల మధ్య కూర్చున్నారు అధ్యక్షులవారు.

వరసగా వక్తలు ఆనాటి విశిష్ట గౌరవ అతిథీ + మంత్రివర్యులైన అసామాన్యరావుగార్ని తమతమ ఉపన్యాసాలతో ఆకాశానికెత్తేశారు. వారికి వేసిన దండలకీ, కప్పిన కాశ్మీరు శాలువాలకీ లెక్కే లేదు. ఇక గిఫ్టుల సంగతి అడగక్కరలేదు.

ఈ కార్యక్రమం జరుగుతున్నది టౌన్ హాల్లో. సామాన్యులకి అందుబాటులో వుండదది. కొండ మీది కోతినైనా నేలమీదకి దింపగల నాయకులకీ, వినాయకులకీ మాత్రం 'ఉచితం' గా దొరుకుతుంది. రైలు, కారు, ఫ్లైటూ, అన్నీ వారికి ఉచితాలే. సరే. కార్యక్రమం తరవాత బిజినెస్ మేగ్నెట్ (?) కుబేర గుప్తుల వారితో విందు. 88 వంటకాలు అతిథుల్ని సంతృప్తి పరచటానికి సిద్ధంగా వున్నాయి. తినేదెంతో పారేసేదెంతో తెలిసేది ఆ పైవాడికీ, అమర్చిన కేటరింగు వాడికీ!

గవర్నమెంటు హాస్పిటల్ వరండాలో పడివున్నారు

విభీషణ శర్మగారు. ఆయనకి 'మహామహోపాధ్యాయ' బిరుదు నిచ్చింది బెంగాల్ గవర్నమెంటు. తెలుగు, ఇంగ్లీషు, బెంగాలీ, మరాఠీ, తమిళ భాషల్లో ఆయన నిష్ణాతుడు. పుట్టుకతో కోటీశ్వరుడు. కానీ, తండ్రిగారు స్వాతంత్ర్య సమరోత్సాహంతో ఆస్తినంతా గాంధీగారి జోలెలో పోశారు. అంతే గాదు, ఆ స్ఫూర్తితో ఊరికి స్కూలు, గ్రంథాలయం, పంచాయితీ ఆఫీసు ఎక్సెట్రాలు సొంత ఖర్చులతో కట్టించి, అభినవ కర్ణుడనే బిరుదు కూడా పొందారు. తండ్రిగారి పోలికే కొడుక్కీ వచ్చింది. పైగా పిల్లలు కూడా లేరాయే! దాంతో విభీషణశర్మ గారు విజృంభించి మరీ దానధర్మాలు చేశారు. మంగళసూత్రాలు మట్టెలు వంటివి ఇవ్వడమే గాక చాలామంది ఆడపిల్లల పెళ్ళిఖర్చులు కూడా తన జేబునించి పెట్టుకున్నారు. ఇక, ఫీజులు కట్టి చదివించిన పేద విద్యార్థుల సంఖ్యకి అంతే లేదు.

పేదరికమనే పెనుతుఫానుకి ఆత్మీయత, అభిమానం, కృతజ్ఞత, గౌరవం అనే మబ్బులు కకావికలై దిగంతాలకి ఎగిరిపోగా, ప్రస్తుతం ఆయన గవర్నమెంటు హాస్పటలు వరండా మెట్లమీద పడివున్నాడు. ఆ గవర్నమెంటు హాస్పటలు కట్టడానికి స్థలమిచ్చింది విభీషణశర్మగారి తండ్రిగారే. ప్రస్తుతానికి ఆయన మంచీ చెడ్డా కనుక్కునేవారు ఎవరూ లేరు. ఆయన్ని హాస్పటల్లో పడేసింది కూడా గజముఖరావుగారనే వార్డు మెంబరుగారి కారు డ్రైవరు. అక్కడా ఓ 'మతలబు' వుంది. కావలసిన పేపర్లమీద ముందుగానే గజముఖరావుగారు వేలిముద్రలు పకడ్బందీగా వేయించుకున్నారు. కాదుమరీ! శర్మగారు స్పృహలో లేరాయే. ఒకవేళ వున్నా, ప్రతిఘటించే ఓపిక ఎప్పుడో చచ్చెనాయే. పోయేవాడు ఇంటిని వెంట తీసుకుపోలేడు కదా! ఆ యిల్లు మాత్రం ఏమన్నా సామాన్యమైనదా? ఉహూ..... కానేకాదు. గాంధీగారికి విడిదిచ్చిన ఇల్లది. జాతీయనాయకులందరితోనూ విభీషణశర్మగారికి వున్న పరిచయాన్ని ఫోటోల రూపంలో గోడలనిండా నింపుకున్న ఇల్లది. ముందో అరెకరం, వెనకో అరెకరం విస్తీర్ణంలో నిర్మించిన ఇల్లది.

అటువంటి స్థలాన్ని, అందులోనూ ఊరికి గుండెకాయలాంటి చోటులో వుండే స్థలాన్ని, ఎలాగూ వదలడం? అసలు వదిలేంత పిచ్చోడెవరూ? అందుకే గజముఖరావు అనే వార్డు మెంబరు, మంత్రివర్యులైన శ్రీయుత అసామాన్యరావుగారి మద్దతుతో 80/20% నిష్పత్తిలో పంచుకోవడానికి ప్రణాళిక అమలుపరిచారు. 80% అసామాన్యరావుగారికీ, 20% గజముఖరావుగారికీ! ఏనుగు ఆకలి ఏనుగుదీ - ఎలక ఆకలి ఎలకదీ కదా!

"అయ్యా... ఎవరి బాధలు వారివి. అలాగే ఎవరి బాధ్యతలు వారివి. ఆ స్థలం ఖరీదెంతో, దానివల్ల వచ్చే ఇతర లాభాలేమిటో, అన్నీ క్షుణ్ణంగా మాకు తెలుసు. మరో విషయం కూడా మీరు చిత్తగించాలి. దానిమీద తమ కన్నూ, పేపర్లే (డాక్యుమెంట్స్) కాదు, చాలామంది కళ్ళూ పేపర్లు వున్నాయి. అన్నింట్లోనూ మీవే కరెక్టు అని నిర్ధారించడానికి నానా గడ్డీ కరవాల్సి ఉంటుందని మీకూ తెలిసిన విషయమే కదా! కనుక..... " ఆగాడు నరోత్తమరావు. నరోత్తమరావు ఓ పెద్ద గవర్నమెంటు ఆఫీసులో ఓ సదుద్యోగి. సదుద్యోగి ఎందుకంటే సదా సత్యాన్నే వెల్లడిస్తాడు. ప్రియం కాని సత్యాన్ని పెదవులవెనకే దాస్తాడు, కానీ బయటికి రానీడు.

డైలాగ్ ఎలా ఎప్పుడు ఎక్కడ మొదలెట్టాలో చాలామందికి తెలుసు. తెలీనిదల్లా ఎక్కడ ఆపడం అనేదే. ఆ విషయం క్షుణ్ణంగా తెలిస్తే చాలు లోకాన్ని క్షణంలో గెలవచ్చు. డైలాగ్ ఎక్కడ ఆపాలో, అలా ఆపడం వల్ల వచ్చే లాభనష్టాలేమిటో నరోత్తమరావుకి సంపూర్ణంగా తెలుసని గజముఖరావుకి కూడా తెలుసు. "అవును మరీ... పీత కష్టాలు గీతకీ, గీత కష్టాలు సీతకీ తెలుస్తాయటండీ?

పనిగావడం ముఖ్యం. మంత్రిగారు వూళ్ళో వున్నప్పుడే 'మతలబు' కానిచ్చామనుకోండీ.., మాటకి మాటా దక్కుతుంది... నోటుకి నోటూ జమపడుతుంది" నవ్వాడు గజముఖరావు.

*****

"కనుక మహాజనులారా..! పాముపిల్ల కరిస్తే మనిషికి ప్రాణం పోదు. కారణం మనిషిని చంపేంత విషం దాని కోరల్లో తయారుకాదు. కానీ అది పెద్దది అయినప్పుడూ? అలాగే మనం చేసిన తప్పులు చాలా చిన్న తప్పులని మనం భావించవచ్చు. కానీ ఆ తప్పుల పట్టీ పెరిగితే? అందుకే మంచీ చెడూ ఆలోచించి మరీ జీవించాలి. ఏది తప్పో ఏది ఒప్పో చెప్పేది నీ అంతరాత్మే", ప్రసంగం ముగించారు శాస్త్రిగారు.

*****

విభీషణశర్మగారి ప్రాణం గాలికి ఊయలలూగే దీపంలా కొట్టుకుంటోంది. 'ఇంకెంతసేపూ' అన్నంత అసహనంగా లగ్జరీ సూట్ లో మందు సేవిస్తూ తిరుగుతున్నారు అసామాన్యరావు గారు. గజముఖరావుగారు ఆత్రంగా 'కబురు' కోసం ఎదురు చూస్తుంటే, నరోత్తమరావుగారు 'కేష్' లెక్కపెట్టుకుంటున్నారు. ఒకటా రెండా, సూట్ కేస్ నిండా కొత్త కట్టలే. సూర్యుడు మండుతూనేవున్నాడు అన్నీ చూస్తూ.

****

"థాంక్స్ రా ... నువ్వు కనక మా వాళ్లకి నచ్చచెప్పకపోతే ఇంత అద్భుతమైన అనుభవాల్ని మిస్ అయ్యేవాళ్ళం", విఠల్ రావుని పొగుడుతూ అన్నాడు సుమన్ చౌదరి.

"యా.! లేకపోతే చచ్చినా మా డాడీ ఒప్పుకునేవాడు కాదు", సపోర్టింగ్ గా అన్నాడు పవన్.

"అబ్బ పొగడకండిరా ... ముందు **enjoy** " ఛీర్స్ చెప్తూ అన్నాడు విఠల్. పార్టీ సాగుతూనేవుంది.

"అరేయ్... ఇప్పుడు పోదాంరా లాంగ్ డ్రైవ్ కి", ఉత్సాహంగా అన్నాడు పవన్.

"డ్రైవర్ ఎప్పుడో వెళ్ళిపోయాడు కదరా", బద్ధకంగా అన్నాడు సుమన్.

"షటప్... నేనున్నాను కదరా... పదండి", వింటర్ జాకెట్ అందుకుని అన్నాడు విఠల్.

ఢిల్లీ చలిలో జోగుతోంది. చలికి తోడు పొగమంచు. అసామాన్యరావుగారి కుమారుడు విఠల్ యమాస్పీడ్ తో పోనిచ్చాడు ఆడి కారుని. పదిహేను నిముషాల తరవాత ఊరు ఉలిక్కిపడింది. కారు ముక్కలై నేలవాలింది. కారణం ఫాగ్ లో కారు కాంక్రీటు వంతెనకు గుద్దుకోవడమే.

****

"క్షమించండి శర్మగారూ... నా పూర్వజన్మ సుకృతం... మిమ్మల్ని బ్రతికించుకోవడం", కోలుకుంటున్న శర్మగారితో అన్నాడు డాక్టర్ శివప్రసాద్. ఆయన డ్యూటీలోకి వస్తూనే శర్మగారిని గుర్తించడం శర్మగారి అదృష్టం. ఆ కుర్రాడ్ని చదివించింది శర్మగారే.

****

అసామాన్యరావుగారి ఇల్లు ఏడుపులతో మారుమోగుతోంది. అన్నట్టు గజముఖరావూ, నరోత్తమరావూ కూడా అక్కడే వున్నారు బిడ్డల శవాల్ని చూసి రోదిస్తూ. వచ్చీపోయే అతిథులకీ, మంత్రులకీ లెక్కలేదు. కానీ ఓదార్పులు ప్రాణాల్ని తిరిగి తేగలవా?

****

ఈ కథ అతుకులబొంతలా కనిపించినా, అతుకుల బొంత మాత్రం కాదు. ప్రతి యాక్షన్ కీ రియాక్షన్ ఉండి తీరుతుందనే న్యూటన్ సిద్ధాంతాన్ని అనుసరించిన కథ. కరెక్టుగా చెప్పాలంటే "మన సుఖసంతోషాలు ఆధారపడేది మనం చేసే పనులనుబట్టే". నీ జీవితాన్ని నిర్దేశించేది నువ్వు చేసే పనులే.

మళ్ళీ కలుద్దాం.

నమస్కృతులతో

భువనచంద్ర

### చిన్న పిల్లల జలుబు ,దగ్గులకు ఇంటి వైద్యం

కొద్దిగా మిరియాలు,కొద్దిగా ధనియాలు, లవంగాలు, దాల్చిన చక్క , కొద్దిగా హారతి కర్పూరం, కొద్దిగా బియ్యం ఇవన్నీ మూకుడులో వేసి బాగా వేయించి , ఒక పల్చని గుడ్డలో వేసి, మూట కట్టి, పిల్లలకు గుండెలమీద, ఛాతీమీద విక్స్ రాసి వెచ్చ వెచ్చగా ఈ మూటతో కాపడం లా పెట్టాలి. పిల్లలు చాలా రిలాక్స్ అవుతారు. ఈ వర్షాలకు, చల్లగాలికి ఇది మంచి మందు.

# వేమూరి వేంకటేశ్వరరావు



## విశ్వస్వరూపానికి బుడగల వాదం

ఈ విశ్వాన్ని సృష్టించినది ఎవ్వరు?
సృష్టి కర్త!
ఆ సృష్టి కర్తని సృష్టించినది ఎవ్వరు?
చొప్పదంటు ప్రశ్నలు వెయ్యొద్దు.
పోనీ ఈ సృష్టి కార్యం ఎప్పుడు మొదలైంది?
బైబిలు ప్రకారం ఓ ఐదు వేల ఏళ్ళ కిందట.
హిందూ పురాణాల ప్రకారం, ఈ సృష్టి కార్యం ఎప్పుడు మొదలైందో ఎవ్వరికీ తెలియదు. సృష్టి, స్థితి, లయ అనే మూడు ప్రక్రియలూ అలా నిరంతరం జరుగుతూనే ఉంటాయని పురాణాలు చెబుతున్నాయి. మన దృక్పథంలో కాలం ఒక చక్రం; బాణం కాదు!
పోనీ భౌతిక శాస్త్రవేత్తలని అడిగి చూస్తే....
“ఎప్పుడో పదమూడున్నర బిలియను (పదమూడున్నర వందల కోట్ల) సంవత్సరాల క్రిందట, ఒక సుముహూర్తాన్న, ఒక మహా పేలుడు సంభవించింది, ఆ పేలుడు ఫలితమే ఈ విశ్వం. ఆ పేలుడు ముక్కలు ఇంకా అన్ని దిశలలోకీ చెల్లా చెదరు అవుతూనే ఉన్నాయి....” అంటూ ఒక చేట భారతం మొదలు పెడతారు.
భౌతిక శాస్త్రం క్షుణ్ణంగా చదువుకున్న నాకే అర్థం అవటం లేదు – వాళ్ళు చెప్పేది. వింటూన్న కొద్దీ మతి పోతోంది. ఇహ సామాన్యుల సంగతి ఏమి చెప్పగలం?
“అయ్యా! ఏదో పేలింది, దాని ఫలితంగా ఈ విశ్వం నిరంతరం అలా వ్యాప్తి చెందుతోంది” అని అంటున్నారు కదా, “ఏమిటి పేలిందో కాస్త చెప్పండి.” అని అడగండి. చెప్పరు!
ఇలా పేలినది ఒక పెద్ద చలివిడి ముద్దలా ఉండేదని అందాకా ఊహించుకుందాం.
ఈ చలివిడి ముద్ద భూగ్రహంలా, బొంగరంలా ఆత్మ ప్రదక్షిణం చేసుకుంటూ ఉండేదా?
ఏమో! తెలియదు.
ఈ చలివిడి ముద్ద ఎక్కడుండేదిట?
“ఎక్కడ?” అనే ప్రశ్నే లేదుట. ఆ చలివిడి ముద్దే అప్పటి విశ్వం అంతా. అదెక్కడ ఉంటే అదే విశ్వంట.
పోనీ, ఈ చలివిడి ముద్దని ఎవ్వరు చేసేరు? ఎక్కడనుండి వచ్చింది? ఏమో! అదీ చెప్పరు.
ఏమిటి పేలిందో చెప్పరు కాని ‘అది’ పేలిన తర్వాత ఏమి జరిగిందో చెప్పగలమంటారు.
కానీ, ఆ పేలుడుకి ‘ముందు’ సంగతి వాళ్ళని అడక్కండి. చెప్పలేరు.
ఏమైనా అంటే, “ఆ పేలుడుతోటే కాలం కూడా పుట్టింది కనుక ఆ పేలుడు కి ‘ముందు’ అనే ప్రసక్తే లేదంటారు.
పిల్ల పుట్టిన తర్వాతే కదా జాతకం రాస్తాం. పుట్టుకకి పూర్వం ఏమిటి జరిగిందో జాతక శాస్త్రం చెప్పదు. అలాగే ఈ విశ్వం పుట్టిన తర్వాత విషయాలని ఆధునిక విశ్వ శాస్త్రం అవగాహన చేసుకోగలుగుతోంది కానీ, అంతకు ముందు సంగతి అడిగితే నానా తంటాలు పడుతూ గుటకలు వేస్తోంది తప్ప సరి అయిన సమాధానం చెప్పలేక పోతోంది.
ఈ రకం ప్రశ్నలకి సమాధానాలు వెతకటమే ఆధునిక విశ్వ శాస్త్రం యొక్క ధ్యేయం.
గత మూడు దశాబ్దాలలో జరిగిన పరిశోధనల వల్ల తెలిసినది ఏమిటంటే – ఈ విశ్వం యొక్క ‘అంతు పట్టటం’ మనకి

తెలియటం లేదని. వాదాలు కుక్కగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి తప్ప ప్రామాణికమైన ఋజువులు దొరకటం లేదు.

ఈ వాదాలలో ఒక వాదాన్ని "సాంకేతిక పదజాలం" ఉపయోగించి చెబుతాను. ఈ కథనంలో ప్రచారంలో ఉన్న వాదం కొంత, నా పైత్యం కొంత ఉన్నాయి.

స్థల కాల పరిమితులు లేని మహా సాగరం ఒకటి ఉందనుకొండి. దాన్ని మోక్ష సాగరం అందాం. ఈ మహా సాగరంలో అనేకమైన నీటి బుడగలు అలా పుడుతూనే ఉన్నట్లు ఊహించుకొండి. సబ్బునీటి బుడగలలా ఈ బుడగలు వ్యాప్తి చెంది, పెద్దవై, ఒక నాడు పుటుక్కుమని పోతాయని ఊహించుకొండి. ఇలా పెరిగి పెద్దవవుతూన్న బుడగల వంటి బుడగలలో ఒకటి మనం నివశించే విశ్వం! ఈ బుడగల ఉపరితలం మీదే ఈ విశ్వంలోని క్షీరరసాగరాలు (గేలక్సీలు), నక్షత్రాలు, గ్రహాలు, వగైరా ఉన్నాయి.

ఆ మహా సముద్రంలో ఇటువంటి బుడగలు ఎన్నున్నాయో ఎవరని లెక్క పెట్టగలరు? ఇదే విధంగా సృష్టిలో లెక్కకి అందనన్ని విశ్వాలు ఉన్నాయి. వాటిల్లో మన విశ్వం ఒకటి. ఇది బుడగలా - ఇంతింతై, వటుడింతై అన్న చందాన్న - వ్యాప్తి చెందుతోంది. ఇదే విధంగా అనంతమైన విశ్వాలు – మనతోపాటు – సమాంతరంగా పుడుతున్నాయి, వ్యాప్తి చెందుతున్నాయి, చివరికి చిట్లిపోయి లయమై పోతున్నాయి. ఈ వాదమే సరి అయినది అయితే ఈ బుడగల జీవిత ప్రమాణం బుద్బుద ప్రాయం కదా! ఇవన్నీ ఎప్పుడో ఒకప్పుడు టప్ మని చిట్లి పోతాయి. బుడగ చిట్లితే ఏమి మిగులుతుంది? కొన్ని తుంపరలు మిగులుతాయి. అవి ఆ మోక్ష సాగరంలో కలిసిపోతాయి. ఈ పదార్థమే మరో నీటి బుడగ పుట్టటానికి కావలసిన ముడి పదార్థం అన్న మాట.

శాస్త్రంలో మనం సిద్ధాంత సౌధాలని ఎన్నిటినైనా నిర్మించవచ్చు. అంతవరకు మనకి అవగాహన అయిన జ్ఞానసంపదని విస్మరించకుండా, ఇంతవరకూ అర్థం కాని ప్రశ్నలకి సమాధానాలు చెప్పగలిగితే ఆ సిద్ధాంతం విజయవంతం అవుతుంది.

దూరదర్శనుల సహాయంతో ఎడ్విన్ హబుల్ చేసిన ప్రయోగాల వల్ల ఈ (మన) విశ్వం వ్యాప్తి చెందుతోందని ఋజువయింది. ఇది సర్వులూ అంగీకరించేరు. మన మోక్ష సాగరంలో బుడగలు కూడా వ్యాప్తి చెందుతున్నాయి కదా. ప్రస్తుతం చెలామణీలో ఉన్న బ్రహ్మాండ విచ్ఛిన్న వాదానికీ నేను కొత్తగా చెబుతూన్న బుడగల వాదానికి కొన్ని సారూప్యాలూ, కొన్ని తేడాలు ఉన్నాయి. ఉదాహరణకి నేను ఉటంకిస్తున్న వాదంలో మన చలివిడి ముద్ద పేలదు (doesn't explode); కాని, అదే చలివిడి ముద్ద వ్యాప్తి చెంది, చెంది, పెద్ద బుడగలా అయిపోయి, అప్పుడు టప్ మని తుస్సుమంటుంది (pops). (ఇక్కడ తెలుగులో explosion కీ popping కీ తేడా గమనించండి!) ఇప్పుడు నేను వివరిస్తూన్న వాదంలో మన చలివిడి ఎక్కడ నుండి వచ్చిందో చెప్పవలసిన పని లేదు; మన బుడగలు సముద్రంలోంచి పుడుతున్నాయి. బుడగ వ్యాప్తి చెంది, చెంది చివరికి ఏమౌతుందో చెప్పటం కూడ సులువే. సబ్బు బుడగలు పుటుక్కుమన్నట్లే ఈ విశ్వం కూడ ఎప్పుడో ఒకనాడు పుటుక్కుమని పోతుంది కదా. అప్పుడు ఈ విశ్వంలో ఉన్న పదార్థం అంతా మోక్ష సాగరంలో కలిసి పోతుంది. జీవి తనువు చాలించిన తర్వాత దాని ఆత్మ పరమాత్మలో కలిసిపోయినట్లూ, భౌతిక కాయం మట్టిలో కలిసిపోయినట్లూ ఊహించుకొండి. బ్రహ్మాండ విచ్ఛిన్న వాదంలో పేలుడుకి ముందు సంగతి మనం అడగకూడదు; అది సమాధానం లేని ప్రశ్న. మన కొత్త వాదంలో విశ్వం పుట్టినప్పుడు పేలుడు ఏమీ లేదు, విచ్ఛిన్నమైనదీ ఏదీ లేదు. పేలుడుకి ముందు మోక్ష సాగరం ఉంది. కనుక పేలుడుతోనే కాలం కూడా పుట్టిందన్న వాదం వీగి పోతుంది. కాల గమనం నిరంతరం అలా సాగిపోతూనే

ఉంటుంది. అది ఆదిమధ్యాంతరహితం. మోక్ష సాగరమూ ఆదిమధ్యాంతరహితమే! ఈ మహా సాగరమే విష్ణువు. ప్రతీ దివ్యశక్తికీ మానవ రూపం ఆపాదించటం మన సంప్రదాయం కనుక ఈ మహా సాగరానికి రూపాన్నిస్తూ మనవాళ్ళు విష్ణువుకి మూర్తిత్వం ఇచ్చి పాల సముద్రంలో మానవాకృతిలో పడుక్కోబెట్టేరు. ఇలా వర్ణనకి లొంగని భావాలకి రూపకల్పన చేసే సంప్రదాయాన్ని ఇంగ్లీషులో iconography అంటారు.

పురాణంలోని కథలకీ సైన్సు లోని వాదాలకీ తేడా ఏమిటంటే, సైన్సులో ప్రతీ వాదాన్నీ ప్రాయోగాత్మకంగా నిరూపించాలి. “నాకు దేవుడు కనిపించేడు కనుక దేవుడున్నాడని నేను ఢంకా భజాయించి చెబుతున్నాను” అన్నంత మాత్రాన సైన్సు ఒప్పుకోదు. దేవుడు కనిపించటానికి మనం చేసిన ప్రయత్నం వర్ణించి చెప్పమని అడుగుతుంది. అదే ప్రయత్నం పలువురు చేస్తే వాళ్ళకీ దేవుడు కనిపిస్తే అప్పుడు మీకు దేవుడు కనిపించేడన్న మాటని నమ్ముతుంది. దేవుడే కనిపించక్కరలేదు. దయ్యం కనిపించిందని చెప్పినా అదే రకం ఋజువు కావాలి. కనుక నేను పైన ఉటంకించిన వాదం నిజమో కాదో తెలియాలంటే ఒక సిద్ధాంతసౌధాన్ని లేవదియ్యాలి. ఈ సిద్ధాంతసౌధానికి గణితం ఇటికలు. ఇంతవరకు ఈ భౌతిక ప్రపంచం గురించి మనకి అవగాహనలో ఉన్న విజ్ఞానం సున్నం. అంటే మనం కట్టే సౌధాలు గాలిలో మేడలులా ఉండకూడదు.

వచ్చిన చిక్కేమిటంటే ఈ రకం గణితం చాలా సంక్లిష్టమైనది. ఈ గణితం సహాయం లేకుండా చెబితే ఏ సైన్సు ఫిక్షన్ కథలాగో, పురాణాల్లో కథలాగో ఉంటుంది.

నేను 1952-54 లో బందరు హిందూ కాలేజీలో ఇంటర్మీడియేట్ చదువుతున్న రోజుల్లో మా తెలుగు పుస్తకంలో ఒక పాఠ్యాంశం ఉండేది. దాని పేరు "వాత్సాయన వంశ వర్ణనం". పూర్తిగా జ్ఞాపకం రావటం లేదు కాని "హరివంశం" అనే పుస్తకం లోంచి తీసిన మచ్చు తునక అని నా అనుమానం. ఈ పాఠ్యాంశంలో ఒకొక్క వాక్యం పొడుగు ఒక పేజీకి మించే ఉండేది. కొరుకుడు పడకుండా, మింగుడు పడకుండా ఉండే ఈ వచనం వాత్సాయనుల వంశాన్ని వర్ణిస్తుంది. మనం పూజ చేసేటప్పుడు ‘ద్వితీయ పరార్థే, వైవస్వత మన్వంతరే, కలియుగే, ప్రథమ పాదే,....’ అనీ ‘జంబూ ద్వీపే, భరతవర్షే, భరతఖండే ...:’ అని ఈ విశాల విశ్వం యొక్క స్థల కాల సమవాయం (space-time continuum)లో మన ఉనికిని చెప్పుకుంటాం కదా. ఈ వాత్సాయనులు రాజవంశం వారు కనుక వారి ప్రవరని చెప్పటానికి రచయిత సృష్ట్యాది నుండీ మొదలుపెట్టి, సృష్టిలో ఈ విశ్వరూపాన్ని వర్ణించుకుంటూ వచ్చి నెమ్మదిగా భారత దేశంలో వీరి రాజ్యం దగ్గరకి వచ్చి, వీరి తాత ముత్తాతలని చెప్పుకు వస్తాడు. టూకీగా ఆ కథనం (నాకు జ్ఞాపకం ఉన్నంత వరకు) చెబుతాను, సావధానంగా వినండి.

“ఈ సృష్టి మన ఊహకి అందనంత విశాలమైనది, పురాతనమైనదీను. సముద్రంలో నీటి బుడగలులా మన ఊహకి అందనన్ని విశ్వాలు ఉన్నాయి. సముద్రంలో నీటి బుడగలు ఉద్భవించినట్లే ఈ విశ్వాలు పుడుతూ ఉంటాయి. బుడగ పేలిపోయి అదృశ్యమైపోయినట్లే ఇవీ అదృశ్యమైపోతూ ఉంటాయి. బుద్బుద ప్రాయమైన విశ్వాలు ఆ మహాసాగరంలో అలా పుడుతూనే ఉంటాయి. వాటి కాలం మూడగానే ఆ బుడగలు కాలం చాలించి మళ్ళా ఆ సముద్రంలో కలిసిపోతూనే ఉంటాయి. అలాంటి బుడగలలో ఒకటి మనం ఉంటూన్న, మన ఇంద్రియాలకి గోచరమవుతూన్న, చరాచర జగత్తు. ఈ జగత్తులో ఉన్న అసంఖ్యాకమైన నభోగోళాలలో ఒకటి మనం నివసించే భూమి. ఈ భూమి మీద, జంబూద్వీపంలో, భరతవర్షంలో, భరతఖండంలో, ఒక రాజ్యంలో...” అర్ధ శతాబ్దం క్రితం చదువుకున్న పాఠ్య భాగం దరిదాపుగా ఇలా కొనసాగుతుంది.

(13 వ పేజీ చూడండి)

# ఆదూరి హైమవతి



## సంతాపమే

(గత సంచిక తరువాయి)

"సరే అలాగే మరి మా పూలతోటలోని పూలు కోసి ఉంచమని పుల్లన్నకు చెప్పను. ఆపూలతో మన హనుమాన్ జీకి పూలమాల అందంగా అల్లినవారికి కూడా బహుమతులుంటాయి" అని తాతగారు అనగానే అంతా 'హోహోహో భలేభలే' అని అరిచారు. ఎందుకో ఇదంతా చికాగ్గా ఉంది పంకజానికి.

ఎవ్వరూ తనని ప్రత్యేకంగా చూడకపోడం భరించలేక పోతున్నది. ఎలాగో తోటచేరి అంతా కోతుల్లా ట్రాక్టర్ మీంచీ దూకారు. అసలా ట్రాక్టర్ ఎక్కడమే చిన్న తనంగా ఉంది పంకజానికి.హాయిగా కార్లో తిరిగే తనీ ట్రాక్టర్ ఎక్కడమేంటీ! తాతగారు ఈ పల్లెకొచ్చాక తనను పట్టించుకోడమేలేదు ఎందుకో. మాటలు, నవ్వులూ అన్నీ వారితోనే. అక్కడ దిగగానే కొందరు రంగు ముగ్గులపొడి తీసుకుని ముగ్గులేయసాగారు. మరికొందరు పూలబుట్టల ముందు కూర్చుని మాలలు అల్లసాగారు. అవేవీరాని పంకజం ఊరికే అందరినీచూస్తూ అటూ ఇటూ తిరగసాగింది. తాతగారూ తోటలో అందరితో మాట్లాడి వచ్చేసరికి పూలమాలలూ, రంగోలీలూ పూర్తయ్యాయి. నిజం గానే పంకజం ఆశ్చర్యపోయింది ఎంతబాగా వేశారు రంగోలీలు! హనుమాన్ ఆకాశానికి సూర్యుని పండుగా భావించి ఎగిరే దృశ్యం, హనుమ సీతమ్మను వెతకను లంకకు సముద్రాన్ని దాటే దృశ్యం, ఇంకా అన్నీ వేటికవే చాలా బావున్నాయి. తాతగారు ఎవరికి ప్రథమ బహుమతి ఇస్తారోమరి! పూలమాలలు ఎంత అందంగా కట్టారు! వీటిలో ఒక్కటైనా తనకు రావు అనుకుంటూ ఉండగా తాతగారు వచ్చి వారందరికీ ఒకేరీతిలో బహుమతులు ఇచ్చారు. "బంగార్లూ! అంత బాగావేశారు. అందరి మాలలూ అందగా ఉన్నాయి. అందుకే అందరికీ సమాన బహుమతులు సాయంకాలం బామ్మ ఇస్తారు. కోతికొమ్మచ్చి ఆడదామా!" అన్నారు. "కాదు తాతగారూ! కబడ్డీ ఆడతాము. అందరం కలసి ఆడవచ్చు", అంటూ కళ్యాణి అనే అమ్మాయి అందర్నీ రెండు జట్లుగా చేసింది. గీతలు గీచారు. పంకజాన్నీ ఒక జట్టులో వేశారు.

ఆటమొదలైంది. పంకజానికి ఆడటం చేతకాలేదు. ఒక గంటలో ఆట పూర్తైంది. పంకజం జట్టు ఓడిపోయింది. ఐతే జట్టులోని వారంతా గెలిచినవారికి చప్పట్లు చరిచి మెచ్చుకోవడం వింతగాఉంది పంకజానికి. తాతగారు అందరికీ కొబ్బరిబోండాలు కొట్టించి ఇచ్చారు. అందర్నీ కూర్చోబెట్టి "బంగార్లూ ! మీకు బ్యాడ్మింటెన్ వచ్చా? భరత నాట్యం వచ్చా? సంగీతం వచ్చా? త్యాగరాజకీర్తనలుపాడుతారా?" అడిగారు తాతగారు.

వారంతా "తాతగారూ! పల్లెపాటలు, కీర్తనలూ వచ్చు, పల్లెనృత్యాలు వచ్చు. మేము పల్లెవాళ్ళం అవేమాకు వచ్చు. మాలాగా పట్నంవాళ్ళు ఈతకొడతారా! ఎవరి ప్రాంతంవారి ఆటపాటలు వారికి వస్తాయి."

"మరి మీకవన్నీ రావని

చింతలేదా!"
"ఎందుకు తాతగారూ! ప్రతి వ్యక్తికీ ఒక్కో కళను భగవంతుడు ఇస్తాడు, ఒక్కో శరీర రంగూ ఇస్తాడు. మనకు ఉన్నవాటితో మనం తృప్తిపడాలి. లేనివీ రానివాటికోసం అసంతృప్తితో అసూయపడితే అదిపెద్ద పాపం. అసూయ వలన ద్వేషం కలుగుతుంది. దానివలన మన సంస్కారమే దెబ్బతింటుంది. సంస్కారం లేని మనిషి పశువుతో సమానం అని మా తెలుగు టీచరమ్మ చెప్పారు. అందుకే మేమెన్నడూ ఎవ్వరితో పోల్చు కోం. మాకున్నదే మాకు.అందుకే మాలో ఎప్పుడూ కోపతాపాలూ, అసూయాద్వేషాలు ఉండవు. అంతా స్నేహంగా ఉంటా" అంది అరిందాలా అమ్మణ్ణి.

"సెభాష్! అమ్మణ్ణీ! అలా ఉండాలి పిల్లలంతా. సరే మరి బామ్మ గారు అందరికీ చాలా భోజనపదార్థాలు పంపారు. అదుగో మన చుట్టు పక్కల పొలాల్లో వారూ, తోటల్లో వారూ వందమందివరకూ వస్తున్నారు. ప్రతిమారూ ఇలాగేకదా బామ్మ వండించి పంపుతారు. బామ్మ పంపిన భోజనాలన్నీ వడ్డన చేయండిరా బంగార్లూ!" అని తాతగారు అనగానే, ముందుగానే తెచ్చి ఉంచిన పంక్తిచాపలు పరిచి, వాటి మీద అరిటాకులు వేసి అంతా వరుసగా వడ్డన చేశారు. అంతా తృప్తిగా తిని తాత గారికి, బామ్మకూ ధన్యవాదాలు చెప్పి వెళ్లారు.

ఇంటికెళ్ళాక రాత్రంతా ఆలోచించింది పంకజం. 'తనకూ ఆపల్లె వారికీ ఉన్న వ్యత్యాసం. తానెంత క్రూరంగా ప్రవర్తించేది! తనకంటే దేన్లో నైనా సరే ఒక్కమార్కు ఎక్కువవచ్చినా, ఆటపాటల్లో ఎవరైనా అధికంగా ఉన్నా భరించలేని తన అసూయ తనకే అసహ్యమేస్తున్నది. చివరకు టీచర్లనుకూడా వెనకాల తిట్టేది ఎక్కువ మార్కులు ఇతరులకు వేశారని. 'ఛీ! తనదెంత పాడు బుద్ధి!' తన ప్రవర్తనకు సిగ్గుతో చితికిపోయింది. రాత్రంతా వెక్కి వెక్కి ఏడ్చింది.

అంతా గమనించనట్లే గమనిస్తూ పంకజం మనస్సులో వస్తున్న పరిణామాలను ముఖ కవళికలతో గమనించి తృప్తిగా ఊపిరి పీల్చు కున్నారు తాతగారూ, బామ్మానూ.

పదిరోజులు పల్లెపిల్లల మధ్య తిరిగి వారిలో ఒకరిగా మారిపోయి సంస్కరింపబడిన పంకజంతో సంతోషంగా తిరిగి వచ్చారు తాతా, బామ్మగార్లు.

నీతి- ఆలోచించి తమ తప్పులు తామే సవరించుకోవాలి.ఎవరి తప్పు వారు తెల్సుకుని తమని తామే సంస్కరించుకోడం ఉత్తమ వ్యక్తుల లక్షణం.

*************

(11 వ పేజీ తరువాయి)

# విశ్వస్వరూపానికి బుడగల వాదం

మళ్ళా ఆ పుస్తకం దొరక లేదు కనుక అంతా తు. చ. తప్పకుండా ఇలాగే ఉందని చెప్పలేను.

గత మూడు దశాబ్దాలలో ఆధునిక విశ్వశాస్త్రం లో జరుగుతూన్న పరిశోధనలు, వాదోపవాదాలూ చదువుతూ ఉంటే నాకు ఈ కథ పదే పదే జ్ఞాపకం వస్తోంది.

ఏవిఁటో ఏదీ సరిగ్గా అర్థం అవటం లేదు.

ఎంత ఆలోచించినా, ఎన్ని పుస్తకాలు చదివినా అనుమానాలు నివృత్తి కావటం లేదు.

ఒకళ్ళేమో ఇదంతా మిధ్య అంటారు. వాళ్ళే, అదే నోటితో, ఇదంతా దేవుడి సృష్టి అంటారు. మిధ్యని సృష్టించడమేఁవిటి?

మనం కనే కలలు నిజమా? మిధ్యా?

కల నిజం ఎలా అవుతుంది? మిధ్య అయిన ఈ కలని సృష్టించినది ఎవ్వరు?

మన మెదడు సృష్టిస్తోంది కదా!

# పాలెపు బుచ్చిరాజు



# ముల్లా నస్రుద్దీన్ కథలు

## 2 వ్యవసాయం

ధనవంతుడి ఇంట్లో పని చేస్తూ నస్రుద్దీన్ కొన్నాళ్ళకి చాలా డబ్బు దాచుకోగలిగాడు. అంతేకాక తెలివైన వాడని అందరిలోను పేరు తెచ్చుకున్నాడు. ఈ లోగా బడిలో పరీక్షలు కూడా పూర్తి చేసి, ముల్లా అయ్యాడు. ఆ రోజు నుంచి అతని పేరు 'ముల్లా నస్రుద్దీన్' అయింది. అంటే అతను ఇప్పుడు భగవంతుడి గురించి భక్తి గురించి ప్రజలకి బోధలు చేయవచ్చునన్నమాట. ఊరి వాళ్ళు ఏవైనా సమస్యలు వస్తే అతని సలహాతో వాటిని తీర్చుకుంటారు. అతను అందరికీ, మంచి చెడ్డలు చెప్పుతూ ఉంటాడు.

ఇప్పుడు పెద్ద వాడయ్యాడు, ముల్లా కూడా అయ్యాడు కనుక, కూలిపని మానేసి తను దాచుకున్న డబ్బుతో వ్యవసాయం చేసి కుటుంబానికి సహాయపడాలని నిర్ణయించుకున్నాడు. ఆ విషయమే యజమానితో చెప్పాడు. ఆయన కూడా అందుకు ఒప్పుకున్నాడు. వ్యవసాయం చేయాలంటే భూమి కావాలి. కాని నస్రు తండ్రి వ్యాపారస్తుడు కావడంతో వాళ్లకి వ్యవసాయం చేయగల భూమి లేదు. అందువల్ల నస్రుద్దీన్, రాజుగారి ఆస్థానంలో పని చేసే ఒక భటుడిని కొంత భూమి కౌలుకి ఇవ్వమని అడిగాడు.

ఆ భటుడు చాలా టక్కరి. అసుయాపరుడు. సమయం చూసుకుని నస్రుని ఎలాగైనా దెబ్బతీయాలని చూస్తున్నాడు. ఇప్పుడు అవకాశం దొరికింది. నస్రు చేతిలో చిక్కాడు కదా అని, అతనితో ఇలా అన్నాడు. "నస్రు భాయ్! నాకు నా భూమి నీలాంటి మర్యాదస్తులకి కౌలుకి ఇవ్వడం ఇష్టమే! కాని నీ దగ్గర ఎడ్లు, పనిముట్లు లేవు. ఎలా దున్నగలవు? పంటని ఎలా చేజిక్కించుకోగలవు? నా కౌలు డబ్బు ఎలా ఇవ్వగలవు?" అని అడిగాడు.

నస్రు పొలంలో ఏం చేయాలో ముందుగానే నిర్ణయించుకున్నాడు. అందుచేత ఇలా జవాబు చెప్పాడు. " భాయ్! నేను కాయ కష్టం చేసి చేను పండించ గలను. ముందుగా కొన్నాళ్ళపాటు, పొలంలో కూరగాయల మొక్కలు వేసి పెంచుతాను. దానికి పొలం దున్న వలసిన అవసరం లేదు. నేనే గొప్పు తవ్వి, నీళ్ళు పోసి మొక్కల్ని పెంచుతాను. వచ్చిన ఫలసాయంతో నీ కౌలు డబ్బు ఇచ్చి, మిగిలిందే నా ఖర్చులకి ఉంచుకుంటాను. ఒక వేళ నాకు నష్టమే వస్తే, నీ ఇంట్లో నౌకరుగా పని చేసి బాకీ తీర్చుకుంటాను. ఇంతకీ నీకు కౌలు డబ్బు ఎంత కావాలో చెప్పనే లేదు."

భటుడు, వీడు బాగానే వలలో పడ్డాడని సంతోషించాడు, నస్రుని బోల్తా కొట్టించాలని ఒక ఎత్తు వేశాడు. కూరగాయలు కదా వేస్తానంటున్నాడు. అందుచేత డబ్బుకి బదులు భూమి మీద పండిన పంట అంతా తనకి ఇచ్చి, భూమి లోపల పండినది నస్రుని తీసుకోమని అమాయికంగా అడిగి నట్టు అడిగాడు. అలాయితే వాడికి మొక్కల వేళ్ళు తప్ప ఏమీ మిగలదు. ఇంకెలా తీరుస్తాడు బాకీ? అని.

నస్రు వాడి కంటే తెలివైన వాడు. వాడి కుయుక్తిని ఇట్టే పసి కట్టాడు. కాని, ఏమీ ఎరగనట్టు, "అలాగే" అని ఒప్పేసుకున్నాడు.

తను కోరుకున్న ప్రకారం భూమిని చేజిక్కించుకుని పంట వేయడానికి దానిని శుభ్రం చేయ-సాగాడు.

కొన్నాళ్ళ తరవాత నస్రుద్దీన్ వేసిన చేను పంటకి వచ్చింది. అతను దానిని కోసుకుని బజారులో అమ్మజూపుతున్నాడని ఆ భటుడికి తెలిసింది. పరుగు పరుగున పోయి, "పంటలో నా భాగం సంగతి ఏమిటి?" అని నస్రుద్దీన్ ని గద్దించాడు.

దానికి నస్రు ఏమాత్రం తొణ-క్కుండా, "అయ్యా! నేను మాట తప్పే మనిషిని కాను. మీ భాగం పంటని జాగ్రత్తగా మూడు బస్తాల్లో దాచి పెట్టాను తీసుకు వెళ్ళండి." అని అక్కడ పడి ఉన్న బస్తాలు చూపించాడు.

భటుడు సంతోషంగా వెళ్లి ఆ బస్తాల్లో ఏముందో అని మూటలు విప్పి చూశాడు. వాటిలో ఎండి పోయి, పండిపోయి, సగం పచ్చి పచ్చిగా ఉన్న ఆకులు మాత్రమే ఉన్నాయి. వాటిని చూడగానే భటుడికిపట్టరానికోపంవచ్చింది. "నన్నిలా మోసం చేస్తావా? చూడు నీ పని ఏం చేస్తానో! రాజుగారితో చెప్పి నీకు తగిన శిక్ష వేయిస్తా-ను. " అని నస్రుని తిట్టుకుంటూ, తిన్నగా రాజావారి ఆస్థానానికి వెళ్లి ఫిర్యాదు చేశాడు.

రాజుగారు నస్రుద్దీన్ అలాంటి పని చేస్తాడంటే ముందు నమ్మ-లేదు. కాని భటుడి ఫిర్యాదు గురించి విచారించాలి కాబట్టి 'వెంటనే రమ్మని' నస్రుద్దీ-న్ కి కబురు పంపారు. నస్రు నిముషాల మీద వచ్చి రాజుగారికి సలాం చేసి వినయంగా చేతులు కట్టుకుని నిలబడ్డాడు.

రాజుగారు అతన్ని చూసి, "ముల్లా! ప్రజలు తప్పు చేస్తే సరి-దిద్దవలసిన వాడివి. నువ్వే మాట తప్పుతే ఎలా? ఇది అన్యాయం కాదా? ఇలా ఎందుకు చేశావు?. నీ మీద ఫిర్యాదు వచ్చిందం-టే నేను నమ్మలేక పోతున్నాను. ఈ భటుడిని ఎందుకు మోసం చేశావు?" అని అడిగారు.

దానికి నస్రు తల వంచుకుని, "ఏలినవారు మన్నించాలి. నేను ఎవరినీ మోసం చేయలేదు. భూమి తీసుకున్నప్పుడు మా ఇద్దరి మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం భూస్వామి కోరిన భాగాన్ని అతనికి జాగ్రత్తగా అప్పజెప్పాను. ఈయనే అనవసరంగా నా మీద నింద మోపుతున్నాడు. " అన్నాడు అమాయికంగా.

రాజుగారికి ఇదేమీ అర్థం కాలేదు. భటుడు మోసం అంటున్నాడు. ముల్లా కాదంటున్నాడు. "అసలేం జరిగిందో వివరంగా చెప్పు" అని అడిగాడు ముల్లాని.

అప్పుడు నస్రుద్దీన్ ఇలా చెప్పాడు. " రాజా! నేను భూమి కౌలుకి తీసుకున్నపుడు, ఈయన శిస్తుగా డబ్బు కి బదులుగా పొలంలో పండిన పంటలో భాగం కావాలని అడిగాడు. దాని ప్రకారం అయన కోరిక మీదనే, నేలపైన పండిన పంట ఆయన తీసుకోవాలని, భూమిలో పండిన పంట నేను తీసుకోవాలని ఒప్పందం చేసుకున్నాము. నేను ఆ భూమిలో కారెట్లు, ఆలుగడ్డ-లు వేసి పండించాను. నా పంట నేను తీసుకుని, ఆయన పంట ఆయనకి ఇచ్చాను. ఇప్పుడేమో ఆయన పేచీ పెడుతున్నాడు."

అదంతా విన్న తరవాత రాజా-వారికి అసలు మోసగాడు ఎవరో అర్థం అయింది. ఇంకెప్పుడూ ఇలా ఎవరినీ మోసం చేయ-వద్దని భటుడిని చీవాట్లు పెట్టి పంపి, ముల్లా తెలివితేటలకి మెచ్చుకుని రాజుగారు అతనికి బంగారు నాణాలు బహుమతిగా ఇచ్చి పంపడమే కాక, తనకెప్పు-డైనా ఇలాంటి ధర్మ సందేహాలు వస్తే సహాయం చేయమని కోరి, పంపించారు.

ఆ రోజు నుంచీ రాజ దర్బారు-కి ముల్లా రాకపోకలు పరిపాటి అయ్యాయి.

# పోడూరి శ్రీనివాసరావు



## ధ్వన్యనుకరణ సామ్రాట్ - శ్రీ వేణుమాధవ్

ధ్వనిని అనుకరించడం ఒక కళ. ఇతరుల గొంతును మాట్లాడడం.... ఒక తమాషా... ఒక వినోదం. దాన్నే సింపుల్ గా మిమిక్రీ అంటాము. దీనిలో చాలా ఒకరి గొంతును మాత్రమే అనుకరించడంగాక, చుట్టుప్రక్కల ఉండే ధ్వనులను అనుకరించడం.... ఉదాహరణకు రైలు బండి వెడుతున్న శబ్దం, తుపాకులు, ఫిరంగులు మ్రోగుతున్నప్పుడు వెలువడే శబ్దం, గుర్రము పరుగెడుతున్నప్పుడు డెక్కల శబ్దం, మనుషులవే గాక జంతువులూ, పక్షులు చేసే శబ్దాలు, వాటి కూతలు, అరుపులు.... ఇలా వివిధ శబ్దాలను, గొంతుకలు తన గొంతులో పలికించడమే, వినిపించడమే మిమిక్రీ కళ.

అదే కాకుండా, ఒక బొమ్మను, ఉదాహరణకు కోతిబొమ్మనో, బాతుబొమ్మనో, ఏదైనా బొమ్మను తీసుకుని ... ఆ యా బొమ్మ మాట్లాడుతున్నట్టుగా, మనం మాట్లాడుతున్నట్టు ఇతరులు గుర్తించలేని విధంగా..... మాట్లాడే ప్రక్రియ 'వెంట్రిలాక్విజమ్'. ఆ బొమ్మే మాట్లాడుతున్నట్టు భ్రమ కల్పించే, పెదవులు కూడా కదలకుండా బయటకు కనిపించే మాటలాడే విధానాన్నే వెంట్రిలాక్విజమ్ అంటారు.




ఇలా మిమిక్రీ, వెంట్రిలాక్విజమ్ ఆదిగా గల ధ్వన్యనుకరణ విధానానికి, ప్రక్రియకు భారతదేశంలో శ్రీకారం చుట్టిన ఆద్యుడుగా శ్రీ నేరెళ్ల వేణుమాధవ్ గారినే చెప్పుకోవాలి.

వరంగల్ నగరం లోని ముట్టెవాడకు చెందిన ప్రముఖ వ్యాపార వేత్త నేరెళ్ళ శ్రీహరి, శ్రీలక్ష్మి దంపతులకు 1932 డిసెంబర్ 28 న శ్రీ వేణుమాధవ్ జన్మించారు. వారికి చిన్నతనంనుంచీ విద్యాభ్యాసం మీద అంత శ్రద్ధ లేకపోవడంతో, ఎనిమిది సంవత్సరాల వయసులో చదువు మొదలు పెట్టినప్పటికీ, పెద్దగా ప్రతిభ చూపించిన దాఖలాలు లేవని వారే స్వయంగా చెప్పుకున్నారు. ఆయనకు బాల్యంనుంచే ధ్వన్యనుకరణ అంటే

అభిరుచి ఉండేది. ఆ కల వారికి సహజంగా అబ్బింది ఆ కళలో తన తండ్రే తనకు తొలి గురువని శ్రీ వేణుమాధవ్ చెబుతుండేవారు. తండ్రి చేసే ఇప్పపువ్వు, బియ్యం వ్యాపారంలో భాగంగా, తమ ప్రాంతానికి వేటకోసం వచ్చే బ్రిటిష్ అధికారులతో, వారి యాసలోనే, తన తండ్రి ఇంగ్లీష్ మాట్లాడడం వేణుమాధవ్ గారిపై బాల్యంలోనే ప్రభావం చూపించింది. రోజుల్లో మిమిక్రీయే తన లోకంగా ప్రవర్తించే వేణుమాధవ్ గార్ని వారి తండ్రి 'గాడిద కొడకా, ఇందులోనే బతుకుతావు ఫో' అని తిట్టినా తిట్టే భవిష్యత్ లో నిజమయిందని వేణుమాధవ్ గారు ఒక సందర్భంలో గుర్తు చేసుకున్నారు. ధ్వన్యనుకరణ కళ సహజంగా అబ్బిన శ్రీ వేణుమాధవ్, తన చుట్టుప్రక్కల ఉండేవారిని, అదేవిధంగా తనకెంతో ఇష్టమైన సినిమా నటులను అనుకరిస్తూ ఉండేవారు. అడపా తడపా తండ్రి చేతిలో దెబ్బలు తినడం మామూలే! ప్రసిద్ధ నటులు ఎన్ టి ఆర్, ఏ ఎన్ ఆర్, అలాగే లాల్ బహదూర్ శాస్త్రి, గాంధీ, నెహ్రూ, కెన్నెడీ లాంటి రాజకీయ నాయకులు, సర్వేపల్లి రాధాకృష్ణన్, అరబిందో, వివేకానంద మొదలైన ఆధ్యాత్మిక ప్రతిభామూర్తులు... ఇలా ఎందరిని వేణుమాధవ్ అలంకరించేవారు. ఆయన ప్రాధాన్యత మిమిక్రీకి,



నాటకాలకి, చిత్తూరు నాగయ్య సినిమాలకి ఇవ్వడంతో మెట్రికులేషన్ పరీక్ష తప్పారు.

ఆ తరువాత ఉత్తీర్ణుడై, పెద్దల కోసమే పై చదువులకు వెళ్లారు. వారి జీవితంలో అదే టర్నింగ్ పాయింట్ అయింది. వేణుమాధవ్ చదువుతున్న ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ గ శ్రీ బారు వెంకట రామనర్సుగారుండేవారు. వారు శ్రీ వేణుమాధవ్ ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేవారు. ఓరోజు విచారంగా ఉన్న వేణుమాధవ్ ను చూచి, వివరమడ గగా, ఎన్నో ఇంగ్లీష్ సినిమాలు వస్తున్నాయని, తన తండ్రి డబ్బులివ్వకపోడంవల్ల, అవన్నీ చూడలేక ఫీలవుతున్నాననీ దిగులుగా చెప్పారు వేణుమాధవ్. వెంటనే, ప్రిన్సిపాల్ తన జేబులోంచి అరవై రూపాయలు తీసి ఇచ్చారట. ఆ అరవై రూపాయలతో వేణుమాధవ్ గారు ఏకంగా 30 ఇంగ్లీష్ సినిమాలు చూశారట. అంతేగాక సినిమాల్లోని దృశ్యాల నేపథ్య సంగీతాన్ని, నటుల గొంతుకలను అద్భుతంగా అనుకరించి చూపారట. దాంతో ఉద్విగ్న భరితుడైన ప్రిన్సిపాల్ శ్రీ రామనర్సు వేణుమాధవ్ ని గాఢంగా హత్తుకుని, 'ప్రపంచంలోనే అత్యుత్తమ కళాకారుడవౌతావని' ఆశీర్వదించారట. అంతేగాక తనకున్న ఏకైక కుమారుడు విఠల్ అయితే, రెండవ కుమారుడు వేణుమాధవే అని తెలియజెప్పారట.

కళాకారులు సాధారణంగా తమ ప్రదర్శనలలో నటుల గొంతుకలు, వాహనాల శబ్దాలను, పక్షుల కూతలను.జంతువుల అరుపులను అనుకరిస్తారు. కానీ వేణుమాధవ్ గారు మాత్రం సినిమా సన్నివేశాలను నేపథ్య సంగీతంతో సహా అనుకరించి అబ్బురపరుస్తారు. ముఖ్యంగా హాలీవుడ్ చిత్రాలయిన ;టెన్

కమాండ్ మెంట్స్ ' లోని సీన్లను, మెకన్నాస్ గోల్డ్ చిత్రంలోని గుర్రపు డెక్కల శబ్దాన్ని ఆయన అత్యద్భుతంగా అనుకరించేవారు. వినేవాళ్ళు తాదాత్మ్యం చెంది వారు ఆ సినిమాలను చూస్తున్న భావనలోకి వెళ్ళిపోయేవారు. అచ్చమైన ఆంగ్లేయుల ఉచ్చారణలో ఆయన మిమిక్రీ విదేశీయులను సైతం ఆశ్చర్యచకితులను చేసేది. రాజకీయ నాయకుల్లో ఆయన అనుకరించని గొంతే లేదు. సినిమాలంటే ఇష్టపడి సినీ నటుల గళాలను అనుకరించిన వేణుమాధవ్ 12 సినిమాల్లో నటించారు.

శ్రీ వేణుమాధవ్ ఒకసారి మిమిక్రీ ప్రదర్శన నిమిత్తమై దుబాయ్ వెళ్లారు. విమానాశ్రయం వెలుపల టాక్సీ కోసం ఎదురుచూస్తున్న వారిని, ఒక టాక్సీవాలా గుర్తుపట్టాడు. తాను ఆయన అభిమానినని చెప్పి తన టాక్సీ ఎక్కించుకున్నాడు. తనకోసం 'మొఘల్ ఎ అజం హిందీ చిత్రంలోని పృధ్వీరాజ్ కపూర్, దిలీప్ కుమార్ ల గొంతులను అనుకరిస్తూ డైలాగులు చెప్పమని కోరగా, అతని తృప్తి కోసం, టాక్సీలోనే ఆ నటులను అనుకరిస్తూ డైలాగులు చెప్పారట. శ్రీ వేణుమాధవ్ ని ప్రదర్శనవేదిక దగ్గర దింపిన ఆ టాక్సీవాలా వారి వద్దనుంచి డబ్బులు తీసుకోలేదట. మిమ్ములను కలవడమే నా మహాభాగ్యం అంటూ నమస్కరించి వెళ్ళిపోయాడట. విదేశాలలో సైతం వారి ప్రతిభకున్న గుర్తింపు, క్రేజ్ కు ఇది ఒక ఉదాహరణ మాత్రమే.



1971 లో ఐక్యరాజ్య సమితి వేదికగా మిమిక్రీ ప్రదర్శన చేసిన తొలి కళాకారుడు శ్రీ వేణుమాధవే. అప్పట్లో అక్కడ శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్, శ్రీ జాన్ ఎఫ్ కెన్నెడీలను అనుకరిస్తే 'స్టాండింగ్ ఒవేషన్' దక్కింది. అలాగే ఒక సందర్భంలో నాటి రాష్ట్రపతి శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఎదుటే వారి గొంతుకను, మరో సందర్భంలో నెహ్రూగారిని వారి ఎదుటే, ఇంకో సందర్భంలో శ్రీ కెనెడీని వారి ఎదుటే అనుకరించి వారి ప్రశంసలు అందుకున్నారు. అంతేకాదు, షేక్స్పియర్ నాటకాలలో దృశ్యాలను సైతం ప్రదర్శించి, ఐక్యరాజ్యసమితి సభ్యులను ఆశ్చర్యచకితులను చేశారట.

మాజీ ప్రధానమంత్రి శ్రీ పి వి నరసింహారావు గారితో శ్రీ వేణుమాధవ్ కి సాన్నిహిత్యం ఉండేది. ఎంతో గొప్ప భాషాభిమాని అయినా శ్రీ పి వి నరసింహారావుగారు, మిమిక్రీలో వేణుమాధవ్ చేసే ప్రయోగాలను బాగా ఇష్టపడేవారు. పి వి నరసింహారావుగారు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో శ్రీ వేణుమాధవ్ ని ఎమ్ ఎల్ సిగా నామినేట్ చేయడంతో, 1972 నుంచి 1978 వరకు శ్రీ వేణుమాధవ్ ఎమ్ ఎల్ సి గా కొనసాగారు.

తండ్రి చేసే వ్యాపారం దెబ్బతినటంతో వేణుమాధవ్ కుటుంబపోషణకై, ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారు. విద్యార్థులకు పాఠాలు సైతం మిమిక్రీ కళతో మిళితం చేసి, ఆసక్తికరంగా బోధించేవారు. వృత్తితోపాటు, ప్రవృత్తిగా మిమిక్రీ కళతో అంతర్జాతీయస్థాయికి ఎదగటమే-కాక, ఎన్నో ప్రదర్శనలను ప్రపంచ దేశాల్లో ఇచ్చారు. అంతర్జాతీయ

మీడియా కూడా శ్రీ వేణుమాధవ్ ప్రతిభకు కితాబులిచ్చి, గొప్ప కళాకారుడిగా పేర్కొంది.

ఒకే గొంతులోంచి వెంటవెంటనే ఆర్ద్రత, మార్దవంతో పాటు, గంభీరం కూడా పలికించగల దిట్ట శ్రీ వేణుమాధవ్. ఖంగున మ్రోగే అదే స్వరాన్ని, అంతలోనే పీలగా, నంగిగా మార్చేసి 'ఔరా' అనిపించగలరు. చైనాతో యుద్ధం సమయంలో ఆయన అప్పట్లో శ్రీ ఎన్ టి ఆర్ తో కలిసి పలుప్రాంతాల్లో పర్యటించి నిధులు సేకరించారు.

శ్రీ వేణుమాధవ్ కు నాటకరంగం లోనూ ప్రవేశముంది. చదువుకునే రోజుల్లో ప్రొఫెసర్ జయశంకర్ తో కలిసి నటించిన అనుభవం ఉంది. ఆ తర్వాత రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన బూర్గుల రామకృష్ణారావు గారు వేణుమాధవ్ లో గల మిమిక్రీ కళను గుర్తించి ప్రోత్సహించారు.

ధ్వన్యనుకరణ కళను విశ్వవ్యాప్తం చేయడమే కాదు, దానికొక సిలబస్ రూపొందించి, కోర్స్ గా మలచి, పదో తరగతి చదివినవారు సైతం ఆ కళను అందిపుచ్చుకునేలా తెచ్చిన ఘనత శ్రీ వేణుమాధవ్ దే. హైదరాబాదులోని తెలుగు విశ్వవిద్యాలయంలో మిమిక్రీ ప్రత్యేక డిప్లొమా కోర్స్ గా రూపుదిద్దుకోవడంలో ఆయన పాత్ర ప్రముఖంగా చెప్పుకోవచ్చు. ఇతరుల గళాలను ఎలా అనుకరించాలి? ధ్వఖులను ఎలా సృష్టించాలి? సహజ ధ్వనులకు, మెకానికల్ ధ్వనులకు తేడా ఏమిటి? ఇలా.... విస్తృత స్థాయిలో కోర్స్ రూపొందించారు. నాలుగేళ్లపాటు అధ్యక్షుడిగా కొనసాగారు.

ఆయన వద్ద ధ్వన్యనుకరణ నేర్చుకొన్నవారు వందల సంఖ్యలో ఉంటె, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని, మిమిక్రీ ఆర్టిస్టులుగా ఎదిగిన ఏకలవ్య శిష్యులు వేళా సంఖ్యల్లో ఉన్నారు. శిష్యులంటే వారికి ప్రత్యేక వాత్సల్యం.

పురస్కారాలు, గౌరవాల విషయానికి వస్తే, శ్రీ వేణుమాధవ్ పొందిన సత్కారాలు అన్నీ ఇన్నీ కావు. దేశవ్యాప్తంగా దాదాపు అన్ని విశ్వవిద్యాలయాలు ఆయనను గౌరవించాయి. జె ఎన్ టి యు , కాకతీయ యూనివర్సిటీలు ఆయనకు గౌరవ డాక్టరేట్లు, ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ బిరుదును ప్రదానం చేశాయి. భారత ప్రభుత్వం 2001 లో పద్మశ్రీ పురస్కారంతో గౌరవించింది. 2017 లో ఆయన పేరుతొ తపాలా కవరు ఆవిష్కరించింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆయనను గజారోహణం చేయించి సత్కరించింది. హనుమకొండ పబ్లిక్ గార్డెన్స్ లోనో ఆడిటోరియానికి 2011 డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణం అని నామకరణం చేశారు.

శ్రీ వేణుమాధవ్ గౌరవార్థం, వారి జన్మదినమైన డిసెంబర్ 28 వ తేదీని 'ప్రపంచ మిమిక్రీ దినోత్సవంగా జరుపుకుంటారు.

ఆరోగ్య ప్రతికూల వాతావరణ దృష్ట్యా సుమారు గత పది సంవత్సరాలుగా మిమిక్రీ కళా ప్రదర్శనలకు కొద్దిగా దూరమయ్యారు.

అఖండ ప్రజ్ఞాశీలి, మిమిక్రీ ప్రక్రియను ప్రపంచానికి పరిచయం చేసిన భారతమాత ముద్దుబిడ్డగా ప్రఖ్యాతిగాంచిన, ఐక్యరాజ్యసమితిలో తన మిమిక్రీని ప్రదర్శించి, సభ్యులను సమ్మోహితులను చేసిన ప్రముఖ గళం, 19-6-2018 వ తేదీన శాశ్వత విశ్రాంతి తీసుకుంది. వేయిగొంతుల వేణుమాధవ్ గా ప్రసిద్ధిగాంచిన శ్రీ వేణుమాధవ్ సుమారు 70 సంవత్సరాలకు పైగా ప్రపంచాన్ని తన మిమిక్రీ కళతో అలరించిన సరే వేణుమాధవ్, మిమిక్రీ కళను ఒక సబ్జెక్టు గా గుర్తించి తెలుగు విశ్వవిద్యాలయంలో డిప్లొమా కోర్సులకు శ్రీకారం చుట్టిన శ్రీ వేణుమాధవ్, జాతీయంగా, అంతర్జాతీయంగా తన మిమిక్రీ కల ద్వారా భారతదేశానికి గుర్తింపు తెచ్చిన శ్రీ వేణుమాధవ్ - వేలమంది ప్రత్యక్ష, పరోక్ష ఏకలవ్య శిష్యులను దుఃఖ సాగరంలో ముంచి, దివికేగారు. వారి జ్ఞాపకాలే మనకు మిగిలాయి. వారి ఆత్మకు శాంతి కలగాలి.

- పోడూరి శ్రీనివాసరావు

98494 22239

## శనగవరపు కృష్ణమూర్తిశా-



# నేపాల్ యాత్ర

సీ. కాశీ పురాధీశ కాలకంఠేశ్వరా
బ్రహ్మాండ రూపాయ భస్మదేహ
శశిని శిఖన దాల్చి చండ చాపము తోడ
శూల హస్తము తోడ శోభనొప్పు
నాగాభరణముల నగుమోము నా సామి
మూడు కన్నులు కల్గి ముచ్చటౌను
రుద్రాక్ష ధారియై రుద్రనామము తోడ
రుగ్మతలను బాపు రూఢిగాను

ఆ.వె. గంగ తీరమందు గౌరీ సమేతుడై
అన్నపూర్ణ గూడి నాదరించు
కాలభైరవుండు కాపలా కాచేటి
నీకు వందనంబు నేను సేతు

సి. కాశి పట్టణమందు గంగమ్మకును మ్రొక్కి
తీర్థస్నానము చేసి తీరుగాను
దండపాణిని చూసి దండి దీవెనలొంది
కాలభైరవు ననుగ్రహముబొంది
వారాహి మాతకు వందనమ్మొనరించి
విశ్వేశు దర్శించి వినయముగను
శ్రీ విశాలాక్షమ్మ శ్రీ అన్నపూర్ణమ్మ
దీవెనలను బొంది ధీటుగాను

పరమ శివుని పేరు భక్తితో తలచుచు
ఇరుకు వీథులలోన నిముడుకొనుచు
కాశి పురము నంత కాలినడక నడ్వ
పుణ్య ఫలము దక్కు పూర్తి గాను.

శా. ఓంకారంబగు నీదు రూపమది తేజోవంతమై యుండగా
ఓంకారేశ్వర నామధేయమున విద్యుల్లాసమై యొప్పుచున్
ఓంకారంబది సత్య పాలనకు నిత్యోపాసనై యుండగా
ఓంకారంబగు మోక్షసాధనము దైవోపాయమున్ శంకరా

ఉ. కాంచుము సత్యవాక్యము' మ' కారము నందున నిత్యరూపియై
పెంచును ఆత్మశక్తియును విజ్ఞత మెండుగ ప్రాణులందునన్
త్రెంచును మాయబంధములు తెర్చును సత్యకవాటముల్ యిలన్
పొంచి 'మ' కారమున్ ఒడిసి పొంద మహేశుని గాంచు శంకరా

చం. శివుడు శుభంబులన్ గలుగ చేయును శాంతము. మోక్షమిచ్చు నా
శివుడె సుఖంబు లిచ్చునుగ సేమము చూచుచు సంతసంబుగన్
శివుని 'శి' కారమున్ దలప చీకులు చింతలు ఛిద్రమౌనుగా
శివుడు వినిర్మలంబయిన చిత్తములన్ గ్రహియించు శంకరా

ఉ. నమ్రత తోడి జీవనము నాచరణీయము జీవకోటికిన్
నమ్రతయే 'న' కారముగ నాణ్యత పెంచును జీవితంబునన్
నమ్రత నేర్పు బుద్ధి సహనంబును సేవయు కార్యదక్షతన్
నమ్రతలో 'న' కారమును నమ్మగ కోర్కెలు తీరు శంకరా

ఉ. వాహన పద్ధతిన్ దెలిసి వాసిగ చోదకుడెట్లు వాడునో
వాహన దేహమున్ శివుడు భద్రము తోడ ' వ 'కారమౌచు సం
దేహము లేగ నడ్పునుగ దీనుల కాచుచు శత్రుహారిగా
బాహుబలంబు నాదనుట భావ్యము కాదుగ చూడ శంకరా

ఉ. ఎచ్చట లేడు ఈశ్వరుడు ?! ఇచ్చట యచ్చట లేకపోవునా?
నచ్చిన చోటునన్ వెదక నచ్చట చూడ 'య' కారమౌనుగా
మెచ్చిన రీతిగా కనుము మెల్లని చూపుల సామినంతటన్
తెచ్చును స్వర్గ ధామములు తియ్యని జీవితమందు శంకరా

ఉ. వాసుకి కంఠభూషణము వాహనమెద్దు మహాశ్మశానపుం
వాసివి శూలచాపములు, భస్మవిలేపన శోభనిచ్చు నీ.
కోసము భక్తులెల్లరును కూడిరి కాశిపురంబునందునన్
దోసము లెన్నిచేసినను దూషణ చేయక కావు శంకరా

(మిగిలినది వచ్చే సంచికలో)

# బాక్స్ బద్దలుకొట్టిన జయవిజయుడు

# శీర జయరాం

శ్రీ శీర జయరాం 1961 డిసెంబర్ 25 న ఆంధ్ర ప్రదేశ్ లోని విజయనగరం జిల్లా కురుపాం గ్రామంలో జన్మించారు. వీరిది వ్యవసాయ కుటుంబం. ఇంటర్మీడియట్ చదువుతుండగా ఆర్మీ కోర్ ఆఫ్ సిగ్నల్స్ లో ఏప్రిల్ 1980 లో సెలెక్ట్ అయ్యారు. ఒక పల్లెటూరు లోని వ్యవసాయ కుటుంబం లోంచి వచ్చిన ఆయన ఏవిధంగా ప్రతి-ష్టాత్మక అర్జున్ అవార్డు సాధించే స్థాయికి ఎదిగారో ఆయన మాటల్లోనే విందాము. యువతకు ఈయన జీవితం స్ఫూర్తి కాగలదని ఆశిస్తూ చైతన్యం సంకల్పబలం పత్రిక ఈ శీర్షికను ప్రచురిస్తోంది. -ఎడిటర్

నేను కురుపాంలో 8,9 తరగతులు చదువుతున్న-ప్పుడు ఎన్ సి సి లో ఉన్నాను. వైజాగ్ మరియు కశింకోట ఎన్ సి సి కేంప్ ల్లో పాల్గొన్నాను. ఈ కేంప్ ల్లో ఆర్మీ ఆఫీసర్స్ ప్ర-వర్తన నాకు చాలా నచ్చింది. ఆరోజుల్లో సినిమా చూడటానికి థియేటర్ కి వెళ్తే చలన చిత్రానికి పది నిముషాల ముందు న్యూస్ రీల్ ప్రదర్శించేవారు. అందులో మిలిటరీ యుద్ధం గురించి చూసి నేను ఆకర్షితుడయ్యాను. పార్వ-తీపురంలో ఇంటర్ చదువుతు-న్నప్పుడు తోటపల్లిలో మిలిటరీ



సెలెక్షన్స్ అవుతున్నాయని తెలిసి నేను కూడా వెళ్లి వరుసలో ని-ల్చున్నాను. నన్ను మిలిటరీలో సెలెక్ట్ చేశారు.

నాకు ఊహ తెలిసినప్పటినుం-చీ నేను చదువులో నెంబర్ వన్. మాది పేద కుటుంబం. తినటా-నికి సరిగా తిండి కూడా ఉండేది కాదు. మా నాన్న స్కూల్ కి వె-ళ్లేముందు ప్రతి రోజు 5 పైసలు ఇచ్చేవారు. అందులో మూడు పైసల్ వెళ్తున్నప్పుడు ఏదో తి-నుబండారం కొనేవాణ్ణి. మిగిలిన రెండు పైసలు ఇంటర్వెల్ లో కొనుక్కునేవాణ్ణి. కాళ్లకు చెప్పులు లేకుండా 7 వ తరగతి వరకూ చదువుకున్నాను. హైస్కూల్ లో చదువుకునే రోజుల్లో కోకో, కబడ్డీ,

చెక్కుడుబిళ్ల మొదలగు ఆటలు ఆడేవాణ్ణి. ఇంటర్ చదువుతుండే రోజుల్లో పార్వతీపురం నుండి కురుపాం ఆఖరి బస్సు వచ్చేంతవరకు వీధిలైట్ల క్రింద కబడ్డీ ఆడేవాళ్ళం. సెలవు రోజుల్లో పొలం దగ్గరకు మా నాన్నకు సద్ది అన్నం తీసుకెళ్ళేవాణ్ణి. మాకు పశువులు, గేదెలు ఉండేవి. వాటిని మేపటానికి దూరప్రాంతానికి తీసుకెళ్ళేవాణ్ణి. పొలం పక్కనే ఉన్న గుడిసెలో చదువుకుంటూ, మధ్యమధ్యలో పొలాల చుట్టూ తిరిగే పక్షులు, పశువులను తోలటానికి పొలాల చుట్టూ తిరుగుతుండేవాడిని. నా చదువు అలా సాగింది. పదో తరగతి ఫస్ట్ క్లాస్ లో పాస్ అయ్యాను. మా ఊరు కురుపాంలో ఇంటర్మీడియట్ చదువు లేకపోవటంతో పార్వతీపురంలో చేరాల్సి వచ్చింది. పార్వతీపురానికి రాను పోను బస్సు చార్జీలు రూపాయిన్నర, టీ ఖర్చులు అర్ధ రూపాయి కలిపి నాకోసం రోజుకు రెండు రూపాయలు ఖర్చు అయ్యేది. మానాన్న ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఇంత డబ్బు ఇవ్వటం చాలా కష్టంగా ఉండేది.

నేను ఆర్మీలో ఒక గ్రూప్ అయిన 'కోర్ ఆఫ్ సిగ్నల్స్' లో టెలిఫోన్ లైన్ మాన్ గా సెలెక్ట్ అయి, జబల్ పూర్ వచ్చాను. మిలిటరీ బేసిక్ ట్రైనింగ్ పూర్తి ఆఖరి రోజుల్లో బాక్సింగ్ టోర్నమెంట్ జరిగింది. మా వన్ ఎం టి ఆర్ తరపు నుండి చప్పట్లు కొట్టటానికి 2 స్క్వాడ్స్ మంది అంటే 80 మంది వెళ్లాం. అందులో మా వన్ ఎస్ టి సి బాక్సర్లు వేరే యూనిట్ బాక్సర్లని నాకౌట్ చేయడం చూశాను. ఒక నిముషంలోనే విన్నర్ అయిపోయేవాళ్లు. ఇది చాలా బాగుందనిపించి నన్ను ఆకర్షించింది. నేనూ బాక్సింగ్ నేర్చుకుంటే బాగుండును అనిపించి అక్కడి డ్రిల్ మాస్టర్ (సి హెచ్ ఎం) ని కలిసాను. ఆయన నన్ను ఫైట్ చేయమన్నాడు. ఈ క్రీడలో మెళకువలు ఏమీ తెలియని నేను రిజెక్ట్ అయ్యాను.



మిలిటరీ ట్రైనింగ్ (బేసిక్) పూర్తి అయ్యాక, 30 రోజులు సెలవులో ఇంటికి (మా ఊరు కురుపాం) ట్రైన్ లో బయలుదేరాను. రిజర్వేషన్ లేని కారణంగా జనరల్ బోగీలో ప్రయాణం చేసాను. మొదటిసారి కనక యూనిఫామ్ లోనే వెళ్లాలని చెప్పారు. ఒక లావుగా ఉన్న అతను ఒకరు వచ్చి మా మధ్యలో కూర్చుని నాకు సీటు లేకుండా చేశాడని నేను చాలా బాధపడ్డాను. నన్ను నేనే రక్షించుకోలేకపోతే, దేశాన్ని ఎలా రక్షించగలనని అనిపించింది. బాక్సింగ్ నేర్చుకోవాలనే నా కోరిక మరింత బలపడింది.

సెలవులు అయిపోయాయి. తిరిగి వచ్చి టి టి ఆర్ లో లైన్ మాన్ )టెలిఫోన్) ట్రయినింగ్ చేస్తున్నాను. ట్రైనింగ్ స్టడీ లో కూడా టాప్ కావడంవల్ల స్క్వాడ్ కమాండర్ నన్ను చాలా లైక్ చేశారు. ఒక రోజు రోల్ కాల్ పెరేడ్ లో 'బాక్సింగ్ ఆడాలనుకునేవాళ్ళు పేర్లు ఇవ్వచ్చు' అని సి హెచ్ ఎం అనౌన్స్ చేశారు.

(ఇంకా వుంది)

# వేదుల సుబ్రహ్మణ్యం



# ఎన్నికలలో – ఎన్ని కలలో!

తే.గీ. ఓట్ల లెక్కింపు పూర్తి కాకుండి నపుడె
ముఖ్యమంత్రిని నేనె కాబోలు నంచు
పరవసించగ మధుర భావనలు చేర
చివరి కెట్టుల మారునో సిరులగతుల
నెంచ జాలంగ శక్యమే యేరికైన!
గెలుపు నోటములను ముందు తెలియనౌనె!
కలుగు గెలిచిన మోదము, కానిచోట
ముఖము చిట్లింపు మిగులు సమ్మోదము బదులు ll 1

సీ. తనవార లేవైపు తలయొగ్గుదురొయని
బస్సులో నిరికించి బయట పంపి
పారిపోకుండగ పరివారమును జేర్చి
కావలసినవన్ని కట్టబెట్టి
తరచుగా తలల మొత్తమును లెక్కలు వెట్టి
అచటకిచటికంచు నెచటొ త్రిప్పి
తే.గీ. మొక్కుబడులన్ని దీర్చగ బుజ్జగించి
సహకరించని వారిని చక్కదిద్ది
తగిన సమయాన రప్పించి తంతునడిపి
విజయమందరె యెల్ల నివ్వెర బడంగ! ll 2

సీ. కనుచూపు మేరలో కనుపించి మరుగయ్యె,
ముఖ్యమంత్రి పదవి మోము జూపి
తిరిగి యెన్నాళ్ళకో తెలియదీ భాగ్యము
మిడిసి పడుటకేమి మిగిలి యుండె?
అరచేతి వైకుంఠ మందినట్లే యంది,
చేజారె తలవ్రాత చెదిరి పోయి

రంగస్థలాన రారాజుగా వెల్గొందు
సింగార మెపుడని బెంగ గలిగి
తే.గీ. సహచరులు నిటునటు చూచి జారుకొనగ
మరల వారిని తిరిగి రమ్మనగ లేక
అందరు న్నొక్కగానుండ మందలించు
బలము చాలని బ్రతుకు దుర్భరము నిజము! ll 3

ఆ.వె. కట్టుకున్న గూళ్ళు కరిగిపోయిన నాడు
ఆశలన్నికూలి అలమటించి
అహము దెబ్బతిన్న మొహము చూపగలేక
లోన కుములు రీతి దీనమౌను ll 4

కం. రోజుకొక ముఖ్యమంత్రిని
మోజుగ కూర్చుండబెట్టి మురిపించుదురే!
రాజీ ముగిసిన క్షణమున
మాజీ స్థానమును జూపి మరువగ రారే! ll 5

ఉ. బారల్చాచి ప్రగల్భముల్ వినెడు దౌర్భాగ్యంబునే గాని యే
మూరల్జానలౌ బెత్తలైనను ప్రజామోదంబులౌ కార్యముల్
పూరింపన్ గను తృప్తియున్ మదికి సమ్మోదంబు జేకూర్చు వా
రేరీ కానరె నేతలొక్కరును దామెక్కంగ పీఠమ్ములన్! ll 6

ఉ. ఎన్నికలైన వెంట తమ యెత్తులు యుక్తులు జేర్చి వైరులన్
భిన్నపు రీతులన్ పరితపించగ నేరములందు జొన్పగన్
పన్నుగడల్ సతంబు నడుపంగ నదేమి ప్రజాప్రభుత్వమౌ!
పన్నగమైన తాను పగ పట్టదు జోలికి రాకయుండినన్ ll 7

ఉ. నిన్నటిదాక కాదనియు నేటికి మిత్రములై చరించి ముం
దెన్నడు లేని సఖ్యమొలికించుచు కూటమి పన్ని దాని సం
పన్నము జేసి వైరులకు భంగము కూర్చిన నేరికెగ్గు? తా
మెన్ని సమస్యలన్ములగ నేమగునో మునుముందు కాలమున్! ll 8

తే.గీ. మదిని నిండిన భావాలు గదులు దాటి
గుసగుసలతోడ మొదలయి గొంతు పెరిగె!
పదవులను పంచు సమయాన పంతమేలి

మంత్రి పదవికి మొదలయ్యె మంతనములు!
బెట్టుతో నెక్కడో మది బిక్కుమనగ
అలిగి గోడ దూకుదురేమొ యన్నభయము
నొడలు కంపింప ధైర్యము సడల సాగె!
ఇట్టి ఉమ్మడి కుంపటి నెన్నినాళ్ళు
సైచి యుండగ నేర్తురో శ్రమకు నోర్చి! ll 9

కం. నాలుగు రోజుల ముచ్చట
నీలుగుతో మొదలుపెట్టి నీరసబడకన్
మేలెంచి ప్రజల హితమును
పాలకులు గ్రహించి శక్తి బడయగ నొప్పున్ ll 10

ఎన్నికల తరువాత:

కొందరి ఆక్రోశము: బురద పాపైన త్రొక్కిన బుస్సు మనదె!

ఉ. "నిన్నటి నుండి మంత్రివని నేడిట శాఖల పంపిణీలలో
నున్నతమైనదిచ్చి తనయోగ్యత చాటుదురంచు నెంచ నో
చిన్నది కట్టబెట్టి తమ చేతులు దుల్పుకు బోదురొక్కొ! నా
కున్నబలంబుతో సెగలహోరు సృజించక నూరకొందునే!" ll 11

కొందరి ఆవేదన - చూరు బట్టుకు ప్రేలాడ సోద్యమయ్యె

సి. చూరునే ప్రేలాడి జారిపోతుండగ
నెన్నాళ్ళ నెగత్రోసి యెత్తనౌను!
భారమై యోపు దుర్భరము సైచియు కూడ
మంతనంబుల కెట్లు మనసు జేరు?
త్రాడు తెగునొ యేమొ తరువాతి ముచ్చట
తేరిబారగ జూడ రారె ప్రజలు!
పరిహాసముంజేయ పాడిగాదని దెల్పి
తెరవెన్కగా నక్కి మురిసి పోరె!
తే.గీ. ఎన్ని కోట్లనొ వెచ్చించి యింత వరకు
ఎన్నికలవల్ల నొరిగిన దేదిలేక
ముందురానున్న వెతలను మోయుబదులు
ప్రజలకండగ నిల్చి పోరాడుటొప్పు ll 12

# శ్రీనాధుని కాశీ ఖండం

## (వచనానుసరణం)

## పోచినపెద్ది మురళీ కృష్ణ



### ముందు మాట

కాశీ క్షేత్రంతో భారతీయులకు ఎంతో విడదీయరాని అనుబంధం ఉంది.. జన్మించినా, మరణించినా కాశీ క్షేత్రంలోనే జరగాలని భారతీయులు భావిస్తారు. అంతటి పవిత్ర క్షేత్ర వైభవాన్ని వర్ణించని భారతీయ సాహిత్యం లేదు. స్కాంద పురాణంలో వ్యాసుడు కాశీ వైభవాన్ని విస్తృతంగా వర్ణించాడు. తెలుగు సాహిత్యంలో శ్రీనాధుడు ప్రప్రధమంగా ప్రబంధ రీతిలో కాశీ క్షేత్రాన్ని వర్ణించాడు. ఈ కాశీ ఖండాన్ని మా పాఠకులకు పరిచయం చేయడానికి డా. పోచినపెద్ది వెంకట మురళీ కృష్ణ గారిచే సరళ వ్యావహారిక భాషలో, యధా మూలానుసారంగా అనుసరించిన కాశీ ఖండాన్ని, నెలనెలా అందిస్తున్నాము.

ఈ వ్యాస పరంపర ఆధ్యాత్మిక వేత్తలకు భక్తీ తత్వాన్ని, విద్యార్థులకు శ్రీనాధుని తత్వాన్ని అందించగలదని భావిస్తున్నాము.

- సంపాదకురాలు.

(గత సంచిక తరువాయి)

ప్రతి రోజూ త్రివిష్టపేశ్వరుని-దర్శించుకొన్నవాడు లోకాలలో-ను ఒక వీసము తక్కువ బ్రహ్మతో సమానం అవుతాడు. త్రివిష్టపేశ్వరుని దర్శించుకున్నవాడు మృత్యువును ఎడమ కాలితో తన్నకలడు. ఉత్తర దిశగా ప్రవహిస్తున్న పిలిపిలా నదిలో స్నానం చేసి త్రివిష్టపేశ్వరుని దర్శించుకున్న వానికి దేవతలుకూడా నమస్కరిస్తారు. ఇతర ప్రాంతాలలో చేసిన పాపాలు కాశీనగరంలో ప్రవేశించగానే నశిస్తాయి. కాశీ నగరంలో చేసిన పాపాలు త్రివిష్టపేశ్వరుని దర్శించుకున్న వెంటనే కు నశించి పోతాయి. కాశీ నగరం, జంబూ ద్వీపము, నర్మదా, యమున, సరస్వతీ నదులు కలిసిన ప్రదేశము, ఓంకారేశ్వర స్థానము, త్రివిష్టపేశ్వర స్థానము, ఇవన్నియు ఒకదానికంటే ఒకటి శ్రేష్టమయినవి. సకల దేవతలు సేవించు చుండుట వలన వారి కిరీటి కాంతులవలన ప్రకాశిస్తున్న త్రివిష్టపేశ్వరుని సేవించిన వారికి మోక్షము లభిస్తుంది. త్రివిష్టపేశ్వరుని సేవించిన వానికి "కుంభీ పాకము" మొదలయిన నరకాలు ప్రాప్తించవు. కాశీలో శివ నింద చేసినవానికి తప్ప ఇతర పాపములు చేసిన వారి పాపాలన్ని త్రివిష్టపేశ్వరుని దర్శనంవలన నశిస్తాయి. శివనింద చేయుట వలన మూడు లోకాలను నిందించిన పాపము, తల్లిదండ్రులను నిందించిన పాపము, సమస్త దేవతలను నిందించిన పాపము లభిస్తుంది. శివ నింద చేసిన వానిని చూడగానే శివ భక్తులు దూరంగా వెళ్ళిపోవాలి. వారి మాటలను వినకూడదు. దుర్గతులను పోగొట్టుకొనుటకు కాశీతో సమానమయిన తీర్థము మరికటి లేదు. దేవతలందరిలోనుశాశ్వతమైన దైవము విశ్వేశ్వరుడు ఒక్కడే.

మొదట పంచ నదీ తీర్థములలో స్నానము చేసి, మణి

కర్ణికలో స్నానం చేశిన తరువాత విశ్వేశ్వరుని దర్శించుకున్నట్లుయిన పాపాలన్ని తునాతునకలు అవుతాయి. భాగీరథీ సమీపమునందు ఉన్న సర్వేశ్వరుడు అనల్ప మహిమాన్వితుడు.

త్రివిష్టపేశ్వరుని మహాత్మ్యము.

త్రివిష్టపేశ్వరునకుపడమర ద్రోణేశ్వర లింగము, దానికి ముందర అశ్వత్థామేశ్వర లింగము, వానికి వెనుక శాంతనవేశ్వర లింగము, అక్కడికి వాయవ్య దిక్కునందు వాలఖిల్యేశ్వర లింగము, దానికి సమీపమునందు వాల్మీకేశ్వర లింగములు ఉన్నాయి.

త్రివిష్టపేశ్వరునిఆలయములో పావురముల జత నివశిస్తున్నాయి. ఆ పావురములు ఎగురుచున్నప్పుడు తమ రెక్కల గాలితో ఆలయములోని దుమ్మును ఎగరకొట్టుతున్నాయి. అదేవిధంగా ఆలయంలోనికి రాకపోకలు చేస్తున్నప్పుడు గర్భాలయంలో ప్రదక్షణలు చేస్తున్నాయి. ఆలయంలోని తీర్థాన్ని ఆసక్తితో తీసుకుంటున్నాయి. ఆలయంలోని ప్రసాదాన్ని తింటున్నాయి. ముప్పొద్దులా ఆలయములో శంఖములు, బాకాలు, తప్పెటల, వాద్యముల ధ్వనులను వింటున్నాయి.

ఈవిధముగా ఆ పావురముల జంట సుఖముగా జీవిస్తూ ఉండగా ఒక డేగ ఆ జంటను దూరమునుండి చూచి



వేటాడలని అక్కడికి వచ్చింది. గుడి లోపలి భాగమున ఉన్న ఆ పావురాలను వేటాడానికి వీలుకాక వెనక్కితిరిగి వెళ్ళిపోయింది. ఈ సంగతిని ఆడపావురము చూచి “ నాథా! డేగ మనకు శత్రువు. మనము గర్భాలయములోఉండుట వలన వేటాడుటకు వీలుకాక వెళ్ళిపోయింది. ఆ డేగ పగ పెట్టుకొని వెళ్ళిపోయింది. తిరిగి ఎప్పుడైన మనలను సంహరిస్తుంది. మనము వేరేచోటికి వెళ్ళుట మంచిది" అన్న భార్య మాటలు విని “ఈ విధంగా మాట్లాడుతున్నావేమిటి? నా బల పరాక్రమము నీకు తెలియదా? సాటివారికి భయపడి ఇల్లు పాడుచేసుకొనినచో మనలను చూసి ఇతరులు నవ్విపోరా? ఆ డేగ దయ్యము కాదు కదా? డేగా పక్షే, మనమూ పక్షులమే. నా ముక్కు కొనతో దానిని పొడిచి దాని పొగరు అణుస్తాను. మొగ పావురము మాటలు విని “ ధర్మో జయతి” అని భావించి ఆడ పావురము మాట్లాడకుండా ఊరుకుంది.

మరుసటి రోజు ఉదయాన్నే డేగ దేవాలయము గుమ్మం దగ్గర కాపు కాసింది. పావురముల జంట ఆహారం కోసం బయటకు బయలుదేరాయి. డేగ ఆ జంటను కాళ్ళతో పట్టుకొని దూరంగా ఎగిరిపోతోంది. ఆ పావురములు ఏంచేయాలో తెలియక మొగపావురము డేగ కాళ్ళు కరవమని ఆడ పావురానికి సైగ చేసింది. ఆడ పావురము సమయంచూసి డేగ కాళ్ళు గట్టిగా కరిచింది. డేగ ఆ బాధను తట్టుకోలేక పావురాలను విడిచి పెట్టింది. పావురాల జంట వేగంగా పారిపోయాయి. ఆ జంట కాశీ నగరాన్ని విడిచిపెట్టి అయోధ్యా నగరానికి చేరుకున్నాయి.

(ఇంకా వుంది)

# తుమ్మూరి రాంమోహన్ రావు



# మన విద్యా వ్యవస్థ

కోటి విద్యలు కూటికొరకే,అని మనకు ఓ మంచి సామెత ఉంది.సమాజానికి అనేక రకాల వ్యక్తుల సేవలు అవసరం.రైతు పంటలు పండిస్తాడు.గానుగ వారు నూనె తీస్తారు.పంటలు పండించడానికి కావలసిన పనిముట్లే కాకుండా గృహనిర్మాణానికి తలుపులు,కిటికీలు,దూలాలు,వాసాలు,కుర్చీలు,బల్లలు ఇలా రకరకాల చెక్కపని చేసేవారొకరైతే,బట్టలు నేసేవారింకొకరు,ఇత్తడి,ఇనుప సామాన్లు చేసేవారు మరొకరు,బట్టలు కుట్టేవారు,బట్టలుతికే వారు,కుండలు చేసేవారు,బండలు కొట్టేవారు,ఇళ్లు కట్టేవారు,జుట్టు కత్తిరించేవారు ఇలా చెప్పుకుంటూ పోతే కొండవీటి చాంతాడంత జాబితా అవుతుంది.

ఏ పని అయినా పుట్టగానే రాదు. పరిసరాల్నిబట్టి, పరిస్థితుల్నిబట్టి,అవసరాల్ని బట్టి అలవడతాయి. పైన చెప్పినవన్నీ విద్యలు కావా? కానీ ప్రస్తుత సమాజంలో చదువును మాత్రమే విద్య అనుకుంటున్నాం.చదువు అందరికీ అవసరమైన విద్య.ఏ విద్యకైనా సాధారణంగా అంతిమ లక్ష్యం ఏదైనా ఉద్యోగం.ఎందుకంటే ఉద్యోగం పురుషలక్షణం అని ఒక నానుడి.ఇప్పుడది స్త్రీ లక్షణం కూడా.కాలం మారింది కనుక కాదనలేం.కాని ఒకప్పుడు స్త్రీకి అత్యంత బాధ్యతాయుతమైన అనధికారిక ఉద్యోగం గృహిణిగా ఉండేది.ఇప్పుడు ఉద్యోగ బాధ్యతతోపాటు గృహిణి బాధ్యత తప్పనిసరి కావడంతో మహిళలకు ఊపిరాడని పరిస్థితే.

మనం విద్యావ్యవస్థ గురించి ఆలోచించినప్పుడు
ఈ అన్నింటినీ సమీక్షించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

మంచి పౌరులను సమాజం కోసం తయారు చేయడంలో విద్య ఒక ముఖ్యాంశం.దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విద్యా ప్రణాళికలుండాలి.లేకపోతే అస్తవ్యస్త పరిస్థితి ఏర్పడుతుంది.ఎంత గొప్ప ప్రభుత్వమైనా అందరూ ఇంజనీయర్లైతేనో, డాక్టర్లయితేనో లేదా ఉపాధ్యాయులైతేనో ఉద్యోగాలు అందరికీ కల్పించలేదు.సామాజిక అవసరాల కనుగుణంగా విద్యాప్రణాళికలున్నాయా.చదువుకున్న ప్రతివారికీ మంచి ఉద్యోగం అది ప్రభుత్వోద్యోగమైనా ప్రైవేటు ఉద్యోగమైనా లేదా విదేశీ ఉద్యోగమైనా చేయాలనే ఉంటుంది. ప్రస్తుత చదువులన్నీ కేవలంకొన్ని ఉద్యోగాల దృష్టిలోనే నేర్పించబడుతున్నాయి.దీని వల్ల అనేకమంది ఇంజనీయర్లు,గ్రాడ్యుయేట్లు నిరుద్యోగులుగా మారిపోతున్నారు.దాని వల్ల అశాంతి చెలరేగుతున్నది.యువత ప్రక్కదారులు వెతికే అగత్యం ఏర్పడుతుంది.దీనికి ప్రధాన కారణం
మన సమాజంలో కొన్ని ఉద్యోగాలకున్న క్రేజీనే.

పిల్లల మనోగతాలతో,వారి ప్రతిభాపాటవాలతో పని లేకుండా కేవలం సమాజంలో ఒక పరువు ప్రతిష్ఠలకు సంబంధించిందిగా చదువు మారటమే.

ఈ విషయంలో ప్రతి తల్లిదండ్రులూ ఆలోచించి తీరాలి. ఇది కేవలం మనదేశంలో మాత్రమే ఉన్న దౌర్భాగ్యం.దానికి కొంత కుల మతాలు కారణమైతే మరికొంత అధికజనాభా కారణం,సామాజిక అసమతౌల్యం కారణం.

కేవలం పాఠశాలలు కట్టించటం,వసతులు పెంచటం,మధ్యాహ్న భోజనాలు పెట్టించటం కాదు.

కూలీనాలీ చేసుకునే తల్లిదండ్రులు కూడా తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడానికి సుముఖంగా లేరంటే కారణం ఇంగ్లీషు మీడియం క్రేజ్ తప్ప మరేం కాదు. దీనికి తరుణోపాయం ఒక్కటే.

కొన్ని ఉద్యోగాలు ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారికే కేటాయించాలి.కనీసం ఉపాధ్యాయ ఉద్యోగాలైనా వారికి కేటాయిస్తే వాళ్లు చదివిన చదువు సార్థకమౌతుంది.తెలుగు భాష బతికి బట్టకడుతుంది.అలాగే ఇదివరకు బహుళార్థ సాధక పాఠశాలల్లాంటివి ముమ్మరంచేయాలి. వ్యవసాయ శిక్షణకు సంబంధించిన,ప్రస్తుత సమాజానికి అవసరమైన వృత్తి నైపుణ్య పాఠశాలలు,కళాశాలలు ఏర్పాటు చేయాలి.కొత్త అవసరాలకు తగిన కొత్త కోర్సులు ప్రవేశ పెట్టాలి.గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల స్థాయికి సిలబస్ వేరుగా ఉండాలి.విద్యార్థుల మూల్యాంకనలో కూడా అనేక మార్పులు రావాలి.కేవలం కాగితాలమీది జవాబులకు కాకుండ

మౌఖిక పరీక్షలకు ప్రాధాన్యత కల్పించాలి.

కేవలం పాఠశాలలు కట్టించటం ,వసతులు పెంచటం,మధ్యాహ్న భోజనాలు పెట్టించటం కాదు.

కూలీనాలీ చేసుకునే తల్లిదండ్రులు కూడా తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడానికి సుముఖంగా లేరంటే కారణం ఇంగ్లీషు మీడియం క్రేజ్ తప్ప మరేం కాదు. దీనికి తరుణోపాయం ఒక్కటే.

కొన్ని ఉద్యోగాలు ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారికే కేటాయించాలి.కనీసం ఉపాధ్యాయ ఉద్యోగాలైనా వారికి కేటాయిస్తే వాళ్లు చదివిన చదువు సార్థకమౌతుంది.తెలుగు భాష బతికి బట్టకడుతుంది.

అలాగే ఇదివరకు బహుళార్థ సాధక పాఠశాల ల్లాంటివి ముమ్మరంచేయాలి.వ్యవసాయశిక్షణకు సంబంధించిన,ప్రస్తుత సమాజానికి అవసరమైన వృత్తి నైపుణ్య పాఠశాలలు,కళాశాలలు ఏర్పాటు చేయాలి.కొత్త అవసరాలకు తగిన కొత్త కోర్సులు ప్రవేశ పెట్టాలి.గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల స్థాయికి సిలబస్ వేరుగా ఉండాలి.విద్యార్థుల మూల్యాంకన

లో కూడా అనేక మార్పులు రావాలి.కేవలం కాగితాలమీది జవాబులకు కాకుండ

మౌఖిక పరీక్షలకు ప్రాధాన్యత కల్పించాలి.

అర్హత కేవలం కాగితం మీద రాసిన జవాబులకే కాక

అన్నివిధాలుగా అన్ని దశల్లోనూ పరీక్ష నిర్వహించినప్పుడు నాణ్యమైన విద్యను అందించిన వాళ్లమవుతాం.చదువుకోవటానికి ఎన్నిరాయితీలిచ్చినా సరే ధృవీకరణ నాణ్యతాబద్ధంగా ఉండాలి. ఒకే ఒక్క ఉదాహరణ చెప్పి ఈ నెలకు ముగిస్తాను.రాకెట్ లాంచింగ్లో ప్రయోగించబడే ఉపగ్రహం గమ్యం చేరుకోవడానికి

ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటామో ఒక విద్యార్థిని మానవీయతా పరిమళంతో జ్ఞానవంతుణ్ణి చేయాలంటే అన్ని జాగ్రత్తలు వహించవలసిందే.



# చిలకమర్తి దుర్గా ప్రసాదరావు





# SPOKEN SANSKRIT

+91 9897959425

## (సంభాషణ సంస్కృతం -19)

**Unit I**

बहि: x अन्त: **బహి: xఅంత: Out side x Inside బయట X లోపల**

**1.** गृहस्य बहि: वृक्ष: अस्ति गृहस्य अन्त: पादप: अस्ति ||
**ఇంటి బయట చెట్టు ఉన్నది . ఇంటి లోపల మొక్క ఉన్నది .**
**The tree is outside of the house. The plant is inside of the house.**

**2.** पाठशालाया: बहि: व्यायामशाला अस्ति पाठशालाया: अन्त: ग्रन्थालय: अस्ति || **పాఠశాల ఆవరణ వెలుపల వ్యాయామ శాల కలదు . ఆవరణ లోపల గ్రంథాలయం ఉన్నది .**
**Gymnasium is out side of the school. Library is inside of the school.**

**3.** देवालयस्य अन्त: शिवलिङ्ग: अस्ति देवालयस्य बहि: नन्दीश्वर: अस्ति || **దేవాలయం లోపల శివలింగం ఉన్నది. దేవాలయం బయట నందీశ్వరుడు ఉన్నాడు .**
**The shrine of Siva is inside of the temple. The idol of Nandi is outside of the temple.**
**Note: Try to compose at least ten sentences using these two words** बहि: x अन्त: **explaining what is inside and what is outside of your house.**

**Unit-2**

इतोऽपि **ఇతోऽపి = some thing more/ some more మరికొంత /ఇంకా కొంచెం**

भवता दत्तं धनं पर्याप्तं न भवति अत: इतोऽपि किञ्चित् ददातु ||
**నువ్వు ఇచ్చిన డబ్బు చాలదు అందువల్ల మరికొంత ఇమ్ము .**

The money given by you is not sufficient. There fore give some thing more.

2. मम पिपासा न अपगता अत: इतोऽपि किञ्चित् जलं ददातु ||

**నాకు దాహం తీరలేదు అందువల్ల మరికొన్ని నీళ్ళు ఇమ్ము**

**My thirst is not subsided therefore give more amount of water.**

मम कार्यं न समाप्तम् अत: इतोऽपि समय: अपेक्षित: ||

**నా పని పూర్తి కాలేదు అందువల్ల మరికొంత సమయం కావాలి .**

**My work is not completed therefore I need some more time to finish it.**

**Note:- you try to compose at least 10 sentences of your own using the word** इतोऽपि |

## Unit-3

इत्युक्ते **ఇత్యుక్తే = means అంటే**

**We normally use this word to explain or translate the meaning of the unknown word in to a known language.**

**1.**जामाता इत्युक्ते **son-in-law** भवति ||

**జామాత అంటే అల్లుడు అని అర్థం .**

**The meaning of Jamata is son-in-law**

**2.** लोकयानम् इत्युक्ते **city bus** अस्ति ||

**లోకయానం అంటే సిటీబస్సు**

**Lokayanam means city bus**

**3. Dance** इत्युक्ते नर्तनं भवति||

**Dance అంటే నాట్యము**

**The meaning of dance is Nartanam**

**4.** वेदण्ड: इत्युक्ते **elephant bhavati.** भवति|

**వేదండ: అంటే ఏనుగు (వేదం అండం గా కలది వేదండం . ఏనుగు సామవేదం నుంచి పుట్టింది అందుకే ఏనుగును సామజమని వేదండ మని అంటారు .**

**The meaning of the word Vedanda is elephant.**

**5.** आनकदुन्दुभि:इत्युक्ते वसुदेव: भवति ||

**ఆనక దుందుభి అంటే వసుదేవుడు అని అర్థం**

**Anakadundubhi means Vasudeva , the father of Lord Krishna.**

6. **Committee** इत्युक्ते कार्यवर्गः भवति ||
**Committee అంటే కార్య వర్గ ము అని అర్థం.**
**The meaning of the word committee is kaaryavarga.**

## Unit-4

अन्ते – आरम्भेఅంతే—ఆరంభే **(at the end- in beginning)**

नाटकस्य आरम्भे नान्दी श्लोकः अस्ति नाटकस्य अन्ते भरतवाक्यम्अस्ति ||
**The benedictory sloka is in the beginning of the drama and the Bharatavaakya is at the end of the drama.**
**నాటకం మొదట్లో నాంది శ్లోకం ఉంటుంది నాటకం చివరలో భరత వాక్యం ఉంటుంది .**

2. सभायाः आरम्भे प्रार्थना श्लोकः भवति सभायाः अन्ते वन्दनसमर्पणम् भवति || **సభ మొదట్లో ప్రార్థన శ్లోకం ఉంటుంది .సభ చివర వందన సమర్పణ జరుగుతుంది**
**The prayer is in the beginning of the meeting and vote of thanks is at the end of the meeting.**
3. अहं भोजनस्य आरम्भे सूपं खादामि भोजनस्य अन्ते तक्रं पिबामि ||
**నేను భోజనంలో ముందుగా పప్పు తింటాను చివరలో మజ్జిగ త్రాగుతాను .**
**I eat dhal in the beginning of the meal and I drink buttermilk at the end of the meal**

## Unit-5

चेत् – नोचेत् **చేత్ -- నో చేత్ = if---if not or other wise.**

1. बुभुक्षा अस्ति चेत् खादतु नो चेत् मा खादतु ||
**ఆకలుంటే అన్నం తిను ఆకలి లేకపోతే తినకు .**
**If you are hungry eat food otherwise do not eat**

2. दीपः अस्ति चेत् पठतु नो चेत् मा पठतु ||
**దీపం ఉంటే చదువు లేకపోతే చదవకు .**
**Read if there is light other wise do not read.**

3. धनम् अस्ति चेत् चलनचित्रं पश्यामि नो चेत् न ||
**నేను డబ్బు ఉంటే సినిమా చూస్తాను లేక పోతే చూడను .**

I go for movie if I have money otherwise I do not go.

**Conversational Sanskrit Sloka:**

**The golden words of Balakrishna**

**Once, some gopakas and gopikas of Gokula approached Yasoda, the mother of Krishna and gave a complaint against Krishna saying that he (Krishna) is not attending school regularly. Yasoda summoned Krishna to see her. Krishna rushed to her mother and stood before her. You see how beautifully the conversation is going on between them.**

कृष्ण ! त्वं पठ = కృష్ణ ! నువ్వు చదువుకో My dear Krishna you go to school and read.

किं पठामि ? = ఏం చదువుకో నమ్మా what shall I read?

ननु रे शास्त्रं = అదేంట్రా ఏదో శాస్త్రం చదువుకో my dear boy you read any branch of knowledge.

किमु ज्ञायते ?= ఏం తెలుస్తుందమ్మా? What shall I know?

तत्वं = తత్త్వం తెలుస్తుంది నాయనా! you know the nature or philosophy

कस्य ? = ఎవ్వరిదమ్మా whose?

विभो: = అదేంట్రా ప్రభువు యొక్క తత్త్వం Lord's

स क: ?= ఆయనెవరమ్మా ? who is he ?

त्रिभुवनाधीशश्च = మూడు లోకాలకు ప్రభువురా! the Lord of the three worlds

तेनापि किम् ?= దానివల్ల నాకొచ్చే లాభమేంటమ్మా ? what is the use of knowing Him ?

ज्ञानं, भक्तिरथो विरक्ति: = అదేంట్రా జ్ఞానం, జ్ఞానం వల్ల భక్తి, దానివల్ల వైరాగ్యం కలుగుతాయి కదా ! My dear boy you will attain Knowledge, Bhakti and then Vairagya.

रनया किं? వైరాగ్యం నాకెందుకమ్మా ? = what is the benefit of attaining Vairagya

मुक्ति: + एव +अस्तु , ते = వైరాగ్యం వల్ల ముక్తి కలుగుతుందిరా you will get salvation.

दध्यादीनि भजामि मातुरुदितं कृष्णस्य पुष्णातु व:= అవన్నీ నాకెందు కమ్మా ! పాలు, వెన్న ఉంటే పట్టుకు-రా. హాయిగా తిని కూర్చుంటాను అన్న కృష్ణుని మాటలు మనలను రక్షించు గాక ! Mother, I don't need them . Bring me some amount of milk and butter to eat. The words spoken by Lord Krishna may bring prosperity to all of us. This sloka is authored by Bilvamangala, popularly known as Jayadeva to the literary world. Lord Krishna who Himself the Lord of all Lords and who is ever liberated needs nothing for Mukti.

कृष्ण ! त्वं पठ किं पठामि ? ननु रे शास्त्रं किमु ज्ञायते ?
तत्वं कस्य ? विभो: स क: ? त्रिभुवनाधीशश्च तेनापि किम् ?
ज्ञानं, भक्तिरथो विरक्ति रनया किं? मुक्तिरेवास्तु ते
दध्यादीनि भजामि मातुरुदितं कृष्णस्य पुष्णातु व:

కృష్ణ ! త్వం పఠ కిం పఠామి? నను రే శాస్త్రం కిము జ్ఞాయతే ?
తత్త్వం కస్య ? విభో: స క: ? త్రిభువనాధీశశ్చ తేనాపి కిం?
జ్ఞానం భక్తి రథో విరక్తి రనయా కిం? ముక్తిరేవాస్తు తే
దధ్యాదీని భజామి మాతురుదితం కృష్ణస్య పుష్ణాతు వ:

# నందుల ప్రభాకర శాస్త్రి



## మా ఊరి నందుల ఆత్మీయ కథ

(గత సంచిక తరువాయి)

మొదటిది, చనిపోయిన లేతదూడ చర్మాన్ని వొలవటం, రెండవది, తల్లిని మోసం చెయ్యటం. ఈ రెండు కారణాలవల్ల ఆ పనికి అమ్మ ఇష్టపడలేదు. అయితే ఆ అవసరం లేకుండానే అమ్మ తన ప్రేమతో బఱ్ఱె వీపు తట్టి పొదుగు కడిగి, ఆముదం రాసి పిండటం ప్రారంభించగానే బఱ్ఱె చేపుకు వచ్చేది. మా ఇంట పుట్టిన ప్రతి బఱ్రెదూడకు పేరు పెట్టేవారు. దుర్గాష్టమి రోజున పుట్టిందని ఒక దానికి 'దుర్గమ్మ' అని పేరు పెట్టారు. ఎక్కువగా ఈ దుర్గమ్మ సంతతే మా ఇంట్లో వర్ధిల్లింది.

దూడకు పాలు తాపడం నేర్పటమన్నది అనాదిగా మన సాంప్రదాయం. వంట ఆముదం కడుపులోకి పంపటం వాళ్ళ అప్పుడే పుట్టిన బిడ్డ కడుపులోని కల్మషం 'భేది' రూపంలో బయటకి రావడం వల్ల ఆకలి మొదలవుతుంది. పాలు త్రాగటం మొదలుపెడతాయి. మా చిన్న మనమడు పూష్ణ పుట్టినప్పుడు రెండు రోజులు పాలు త్రాగకుంటే పిల్లల నిపుణుడైన డాక్టరు వచ్చి పూష్ణ నోటిలో చూపుడువేలు కొంచెం పెట్టి రెండు చెక్కిళ్ళను వెనుకకు ముందుకు ఆడించగానే వాడు నోట్లో ఏది పెట్టినా చీకటం నేర్చుకున్నాడు. అప్పుడు నాకు దూడకు పాలుత్రాపటం నేర్పిన మా అమ్మ గుర్తొచ్చింది.

మా ఇంట్లో రెండు మూడు పాలిచ్చే గేదెలు, ఒకటి రెండు 'సూటి' గేదెలు, రెండు మూడు పడ్డలు, దూడలు ఉండేవి. మా యింట్లో పుట్టిన ఒకేఒక దున్నకు 'పోతురాజు' అని పేరుపెట్టారు. ఎందుకంటే ఏడుమంది అక్కచెల్లెళ్లయిన పోలేరమ్మకు ఒకేఒక తమ్ముడు పోతురాజు. ఈ దున్న కూడా మా ఇంట్లో పుట్టిన ఏకైక మగాడు. దీనికి యుక్తవయస్సు వచ్చేనాటికి మా సేద్యగాడు 'చిర్రోడి' కి అమ్మేశారు.

అమ్మ తెల్లవారుజామున మూడుగంటలకు లేచి రెండు మూడు గేదెల పాలు చూసుకునేది. పెద్దనాయన లేచి గాటిమీద వున్న పేడ, కసువు అంతా శుభ్రంగా ఊడ్చి దిబ్బలో వేసేవాడు. రెండు మూడు రోజులకొకసారి 'రొచ్చు కుండలు' ఖాళీ చేయాల్సి వచ్చేది. ఇందులోని పశుమూత్రమంతా కుండలకు తోడి దిబ్బలో పోసేవాడు. పశువులు తినగా మిగిలిన గడ్డి, చొప్ప,... అంటా దిబ్బలో వేస్తే అది మగ్గిపోతూ ఉండేది.

అమ్మ పిండిన పాలు మట్టికుండలో పోసి దాన్ని కట్టెలపొయ్యి మీద సన్నని మంటపై కాస్తూ ఉండేది. ఈ కుండపై ఒక 'ముంత' ను మూతగా పెట్టేది.





ముంత లేదా కంచు చెంబులో కొంచెంగా నీళ్లు ఉండేవి. ఎప్పుడైనా పాలు పొంగితే.... ఈ చెంబులోని నీళ్లు పొంగుపై చిలకరించేది. పొంగు వెంటనే ఆగిపోయేది. ఇలా రెండు మూడు సార్లు జరిగిన తరవాత ఇంకా పొంగురాదు. నిదానంగా పాలు మరిగిపోతూ ఉంటాయి. పైన మీగడ పెద్ద తెట్టె లాగా కట్టేది.

పాలు కాచటం మొదలుపెట్టిన తరవాత పెరుగు చిలకటం మొదలయ్యేది. ఈ శబ్దంతో ఇంట్లో అందరికీ అర్థమయ్యేది రోజు మొదలైందని. రెండు మూడు కుండల్లో పేరపెట్టిన పెరుగంతా ఒక పెద్ద బానలోకి వేసి ఆ బానను ఒక కుదురు మీద ఉంచుతుంది. కుండ వరిగిపోకుండా ఉండడానికి మా వంటింట్లో వుండే స్థంభానికి దగ్గరలో ఈ పెద్ద బానను ఉంచి, ఇందులో కవ్వం ఉంచేది. ఈ కవ్వం కట్టె కూడా అమ్మకంటే ఒక అడుగు ఎత్తు ఉండేది. ఈ కవ్వం అడుగున ఒక తాడు, పై భాగాన ఒక తాడుతో స్తంభానికి ఒక అడుగు దూరంలో తగిలించేది. ఈ తాళ్లు స్తంభానికి ఉంటాయి. అంటే వృత్తాకారంలో వుండే ఈ తాళ్లు పైన క్రింద ఉండడంవల్ల కవ్వానికి ఆధారంగా ఉంటాయి.

ఈ కవ్వానికి మధ్యలో ఇంకో తాడును రెండు మూడు చుట్టాలు చుట్టి రెండు కొనలను రెండు చేతులతో పట్టుకుని కుడిచేతిని లాగినపుడు ఎడమచేయి వదులు చేసి కవ్వం దగ్గరకు పోతుంది. అప్పుడు కవ్వం కుండలో వున్నా పెరుగులో కుడి, ఎడమ వైపులకు తిరుగుతుంది. కవ్వం అడుగున చక్రాకారంలో వున్న చెక్క బొంగరంలా కుడి ఎడమలకు తిరగటంతో లోపలి పెరుగు చిలకబడుతుంది. అయితే కవ్వం కుండకు తగలకుండా చిలకాలి. కుండకు తగిలితే కుండ పగులుతుంది. అలా చిలికి చిలికి వెన్న కాచితే... నాలుగైదు సేర్ల నెయ్యి వచ్చేది. వారం పొడవునా పిల్లా

పెద్దా అందరూ మూడుపూటలా నెయ్యి వేసుకునేవారు.

మజ్జిగ చిలికిన వెన్న తీసిన తరవాత అమ్మ చేతికి వున్న జిడ్డును రోజు ఒక్కొక్కరి ముఖానికి, కాళ్లకు పూసేది. ఇంకా నిద్ర లేచి ఉండేవాళ్ళం కాదు. ఆ స్పర్శతో రోజంతా అమితానందం కలిగేది. చలికాలంలో కూడా పిల్లలకు ముఖం, కాళ్ళు పగిలేవి కావు. ఆ రోజుల్లో వేరే 'క్రీములు' తెలియవు.

ఏ రోజైనా వెన్న పడలేదు అంటే ఆ రోజు మీగడ అంటా ఎవరో తిన్నారని మా పెద్ద మేనత్త ఆరాలు తీసేది. అమ్మకు తెలుసు మీగడ, వెన్న, నెయ్యి దొంగ ఎవరో... ఇంకెవరు... నేనే... అవి కనబడితే చాలు తినెయ్యటమే.

ఒక రోజు మా ఇంటిముందు ఇంట్లో కోమటి పోలయ్య వయసుడిగి చనిపోవటంవల్ల ఇంట్లో అందరూ ఇంటి బయట తలవాకిట్లో వున్నారు. బాగా మసక చీకటి... నాకు అప్పుడు దయ్యాలన్నా శవాలన్నా చచ్చేంత భయం. అందరితోపాటు నేను అక్కడే వున్నా... అయితే ఎప్పుడు నా కాళ్ళు ఇంటి దొడ్డి వాకిటి వైపు నడిచాయో, నా చేతులు ఎప్పుడు దొడ్డివాకిలి 'బారుమాను' ను తీశాయో తెలియదు. ఇంట్లో పాలు పెరుగు పిల్లుల కంటపడకుండా అమ్మ వాటిని ఒక పెద్ద ఇత్తడి గంగాళంలో కొంచెం నీళ్లు పోసి, దాంట్లో కుదురు పెట్టి వాటిపై కుండలు పెట్టి, గంగాళానికి సరిపోయే ఇత్తడి పళ్లెం మూత బోర్లించి పెడుతుంది. అది తీయాలంటే.... 'సలాకు' గానీ చెంచా గానీ ఆ సందులో పెట్టి మెల్లగా పైకి లేపి పళ్లెం పక్కకు పెట్టాలి. అలాంటి సమయంలో భయమెక్కడకు పోయిందో.... మెల్లిగా మూతతీసి మొత్తం మీగడంతా తినేసి, మళ్ళా మూత పెట్టి, వచ్చి అమ్మ పక్కన నిల్చున్నా! నన్ను చూసి అమ్మ చిన్నగా నవ్వింది.

అప్పటికే ఒకే ఒక బర్రె పాలిచ్చేది. అదీ ఒక్కపూట మాత్రమే... వున్న ఆ మీగడ నేనే తినేశా... ఉదయం చిలికితే వెన్న అసలు రాలేదు. మా పెద్దనాయన, మా మేనత్తలకు నెయ్యి తప్పనిసరి. పెద్దనాయన నెయ్యిలేనిది ముద్ద ఎత్తడు. మధ్యాహ్నం భోజనంలో నెయ్యి లేదని పెద్ద గొడవ చేసి అలిగి, అరిచి, నానా రభస చేశాడు. అమ్మ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. నేను చేసిన తప్పుకు అమ్మకు తిట్లు పడటం బాధ అనిపించింది. తరవాత అమ్మను గట్టిగా పట్టుకుని,,, "ఇంకెప్పుడూ చెయ్యనమ్మా" అని ఏడ్చా. అమ్మ అదే చిరునవ్వుతో ... తల నిమురుతూ ఉండిపోయింది. తరవాత ఎప్పుడైనా అమ్మ పెడితేనే తినేవాడిని.

అమ్మ పాలు పిండుతుంటే పిల్లలు చిన్న గ్లాసు తీసుకుని వెళ్ళేవాళ్ళం. ఆ గ్లాసులోనే పాలు పిండి ఇచ్చేది. గోరువెచ్చని పాలు అక్కడే తాగేసేవాళ్ళం. బర్రె ఈనిన వారం పది రోజుల వరకు పెద్దవాళ్లెవరూ ఆ పాలు తాగేవారు కారు. ముఖ్యంగా మా మేనత్త, పెద్దనాయన 'వాతం' చేస్తుందని తాగరు. వెన్న సరిగా రాదనీ పెరుగు చిలకరు. మూడు నాలుగు రోజులు 'జున్ను' తినేవాళ్ళం. మిగతా నాలుగు రోజులు పాలు, పెరుగు అంతా పిల్లలకే. పాలు కాచిన తరువాత తోడేసి, పెరుగు చిలికిన తరువాత ఆ కుండలు కడుగుతారు. అప్పుడు పాలకుండ అడుగుభాగంలో కుండకు అతుక్కుని కొంచెం మాడిపోయిన పాలు ఉండిపోతాయి. అది తీయటానికి అమ్మ చెంచాతో గోకుతుంది. ఈ 'గోకుడు' సుమారు పిడికెడు ముద్ద వస్తుంది. తినటానికి అద్భుతంగా ఉండేది. నాకంటే నాకని పోటీపడి తినేవాళ్ళం.

అట్లాగే నెయ్యి కాచిన రోజు కూడా, నెయ్యి కాచేటప్పుడు అందులో నాలుగు తమలపాకులు వేసి కాచుతారు. వెన్న కాగి, నెయ్యి తయారయ్యేటప్పటికి ఈ ఆకులు నేతిలో బాగా కాగి, మంచి రుచిగా ఉండేవి. ఈ 'గసి' అన్నా, నేతిలో వేగిన తమలపాకులు అన్నా పిల్లలు ఎగబడి తినేవాళ్ళం.

(ఇంకా వుంది)

# ఎలక్ట్రాన్



## ఉచితభోజన విద్యాలయాలు

"బాధ్యత మీదే అనకుండా మనదే అన్నారు. యిది చాలా సంతోషించవలసిన విషయం నాగరాజు గారూ," అన్నాడు రామశర్మ.

"నేను మీకంటే చిన్నవాణ్ణి. నువ్వూ అంటే నాకు ఇబ్బందిలేకుండా ఉంటుంది. నీళ్లకుండీలో ప్రతిరోజూ మునిసిపల్ నీళ్లట్యాంకర్ వచ్చి నీరు నింపుతుందనుకొంటాను. కుండీలోపలి వ్యవస్థ చాలా దారుణంగా ఉంది. మనం ముందస్తుగా ఓ బోరు బావి దించి మంచినీటి సదుపాయం కలిగించాలి."

"దేశపటాన్నే గోడకి వేలాడదీయడానికే దిక్కు లేనప్పుడు, బోరు బావికావాలంటే నిధులు ఎక్కణ్ణుంచి ఇస్తారు?"

"సర్! నేనుపనిచేసిన ఖార్ఖానా యజమాని సురేంద్రసింగ్ చాలా మంచివాడు. దేశ విభజన సమయంలో ఆయన తల్లిదండ్రులు ఇప్పటి పాకిస్తాన్లో ఉన్నజన్మభూమిని వదులుకొని, అంచెలంచెలుగా స్థలాలు మారుతూ, చివరగా ఈ ప్రాంతానికి వచ్చి ఇక్కడ స్థిరపడిపోయారు. స్థానికంగా స్నేహితుల్ని సంపాదించుకో గలిగారు. వారు ముగ్గురన్నదమ్ములు. ఇక్కడే చదువుకొని స్వంత వ్యాపారాలు చేసుకొంటున్నారు. సురేందర్ సింగ్ గారి ఖార్కానాలో పనిచేసే శ్రామికుల పిల్లలకి నేను రాత్రిపూటల్లో ప్రైవేట్లు కూడా చెప్తూంటాను. ఈ మధ్యాహ్నం పోస్టులో ఉత్తర్వులు రావడంతో ముందుగా ఆయన వద్దకే పరుగు తీసి, సంగతి చెప్పాను. ఆయనకి నేను తన ఖార్ఖానా ఉద్యోగం వదిలి ఇక్కడకు వచ్చి చేరడం ఇష్టం లేదు. అయినా నా అభిరుచిని గుర్తించి, దీవించి విడుదల చేశారు. ఆ ఖార్ఖానాలో సింటెక్స్ వాటర్ టాంక్స్ కి కుళాయిలు బిగించే పనికూడా చేస్తారు.ఆయన్నడిగితే కాదనరు. ప్రయత్నించి చూస్తాను. ముందస్తుగా అనువైన చోట అమర్చడానికీ, శుభ్రపరచడానికి వీలుగానూ ఉండే ఓ వాటర్ టాంక్ సంపాదిస్తే బోరుబావి సంగతి తర్వాత చూసుకోవచ్చు."

"నిన్నుచూస్తే దీక్షాపరుడివిగా కానవస్తున్నావు. కూడా రమ్మంటే వస్తాను."

నాగరాజూ, రామశర్మా ఆ సాయంత్రం చీకటి పడే వేళలో వెళ్ళి సర్దార్జీ సురేంద్రసింగ్ ని కలుసుకొన్నారు. నాగరాజు రామశర్మని పరిచయం చేస్తూ, స్కూలు పరిస్థితిని క్లుప్తంగా చెప్పాడు.

"నాకున్న పరిధుల్లో బడుగు విద్యార్థులకు సహాయం చేస్తాను. చెప్పండి ఏం కావాలో?" అన్నాడు సర్దార్జీ.

నాగరాజు మంచినీటి విషయం వివరించాడు. మర్నాడు సాయంత్రానికల్లా సురేందర్ సింగ్ ఖర్ఖానానుంచి ముగ్గురు ఒక టెంపోలో మూడు కుళాయిలు బిగించిన ఒక సింటెక్స్ టాంక్, దాన్ని నిలబెట్టడానికి ఒక మూడడుగుల ఎత్తులో ఉన్న ఒక యాంగిల్ ఐరన్ స్టాండ్ ని తీసుకు వచ్చారు. సురేందర్ సింగ్ తన మోటార్ సైకిల్ మీద వచ్చి, మధ్య వరండాకి ఒక పక్కన దగ్గర్లోనే ఉన్న వేప చెట్టుకింద పెట్టించాడు.

"వాటర్ టాంకర్ రేపు ఉదయం వచ్చి నింపి పోతుంది. తొమ్మిదింటికి మీరు వచ్చి కుళాయికి ప్రారంభోత్సవం చేస్తే మాకు ఆనందమౌతుంది!" అన్నాడు రామశర్మ.

సురేందర్ సింగ్ అలాగేన-

న్నట్లు తల ఊపాడు. మర్నా-డుదయం ఆయన వచ్చాడు. నాగరాజు అప్పటికే వాటర్ టాంక్ మీద తెల్లటి రంగులో 'విద్యా-ర్థులకి సురేందర్ సింగ్ గారి కానుక" అని పేరు అందంగా రాయించాడు. ఆ రాసిన విద్యా-ర్థి శంకర్. కొత్త వాటర్ టాంక్ వద్ద పిల్లలు గుమి గూడారు. సురేందర్ సింగ్ కుళాయి తెరిచి నాలుగు పేపరు గ్లాసుల్లో నీళ్లు-నింపి నలుగురు విద్యార్థులకి అందించాడు. కామేశం, ప్రసాద్ లు స్తబ్ధుగా నిలబడిపోయారే తప్ప ఏమీ ఉత్సాహం చూపలేదు. కుర్రవాళ్లు తరగతి గదుల్లోకి వె-ళ్ళిపోయారు.

సురేందర్ సింగ్ రామశర్మ-తో అన్నాడు. "మీ...కాదు,-కాదు మన నాగరాజు చాలా విషయాలు చెప్పాడు. నా స్నేహి-తుడొకరు బోర్ వెల్స్ తవ్వుతాడు. పైపుల ఖర్చు మీరు పెట్టుకొం-టే అతను ఉచితంగా తవ్వేటట్లు నేను చూసుకొంటాను." అటు-తర్వాత, "నాగరాజ్!రాత్రిపూట ఎలాగో వీలు చూసుకొని ఒక గంటసేపు నా ఖార్ఖానా శ్రామికుల పిల్లల చదువులో సహాయపడ్డం మట్టుకు మానకు," అని నాగరా-జును భుజం మీద తట్టి, రామశ-ర్మకి నమస్కరించి వెళ్ళాడు.

రామశర్మా, నాగరాజూ ఆ వార్డులో ఉన్నప్రతి గుమ్మమూ తొక్కారు. విషయం వివరించి ఆర్థిక సహాయం చెయ్యమని అర్థించా-రు. వాళ్ళిద్దరూ మునిసిపాలిటీ మీది ప్రజల కోపతాపాల్ని చవి-చూశారు. మునిసిపల్ స్కూళ్ళ స్థాయీ ప్రమాణాలమీద చదు-వుకొన్న కొందరు విరుచుకు పడ్డారు. గర్జించిన మేఘం చి-న్నపాటి చినుకులు విదిలించి-నట్టుగా కొంతమంది ఏదో ఇచ్చి పంపించారు. కాస్తంత సొమ్ము పోగుచేశారు. ఆ వార్డులో ఉన్న ఒకాయన ఇస్కాన్ సంస్థలో పని చేస్తాడు. ఆయన వీరిద్ద-ర్నీ తీసుకుపోయి పరిచయం చేశాడు. యజమాన్యం సంగతిని తెలుసుకొని, ముందుకొచ్చి సహాయం చేశారు. రెండురోజు-ల్లో సబ్మెర్సిబుల్ మోటార్ తో సహా బోరు బావి సిద్ధమైంది. అప్పటికి ISCON మందిర నిర్మాణం జరు-గుతోంది. వారి తాపీ పనివాళ్లు నాలుగు రోజులు సాయంత్రాలు వరసగా వచ్చి స్కూలు గోడల్లోని, వరండాల్లోని గుంటల్ని బాగులు చేశారు. పైనున్న పెంకుల్ని సరి-చేశారు. ఒక ఆదివారం వచ్చి వె-ల్లలువేసి పోయారు.

స్కూలుకి కొత్తకళ వచ్చింది. కానీ విద్యార్థుల తీరు మారలేదు. రామశర్మ, నాగరాజులు ఓ రోజు సాయంత్రం క్వారీకి వెళ్ళి, పిల్లల చదువులకు ప్రభుత్వం ప్రోత్సా-హకంగా ప్రవేశబెట్టిన మధ్యాహ్న భోజన పథకం అందరినీ వి-ద్యావంతులుగా చేయడానికే తప్ప, కేవలం సత్రం భోజనాల-కోసం కాదని నచ్చచెప్ప ప్రయ-త్నించారు. ఒక స్త్రీ కార్మికురాలు తన అల్యూమినమ్ డబ్బా తీసి చూపించింది. "నాకొడుకు తన మధ్యాహ్నం భోజనం స్కూల్లో సగం తిని, మిగిలింది ఆకులో చుట్టి ఇక్కడకొచ్చి నాకు యిచ్చి తినమంటూ ఇంటికి పోయాడు. వాణ్ణి స్కూలుకు పంపడానికి ప్రతి రోజూ నానా యాతనా పడాల్సివ-స్తోంది. వాళ్ళు చదువుకొని బాగు-పడితే అంతకంటే ఏం కావాలి? స్కూల్లో భోజనం బాగోలేదం-టారు, సరిగా చదువు చెప్పడం లేదంటారు."

తిరిగి వచ్చిన తర్వాత నాగరాజు రామశర్మతో అన్నాడు. "సర్! రెండిందాలా స్కూలుదే తప్పని ఆమె నింద వేస్తోంది. అయితే అది నింద కాదు, ఉన్న నిజం. ఉపాధ్యాయుల సంఖ్య పెరిగితే-నే కానీ చదువు స్థాయి పెరగదు. భోజనం స్థాయి పెరిగితేనీ కానీ పిల్లలు స్కూలికి రావడానికి సి-ద్ధపడరు. బడుగువర్గాల స్థాయి పెరిగితేనీ కానీ బాలకార్మికుల వ్యవస్థ తరిగి పోదు. సమస్యకు పరిష్కారం చూడాలి. ప్రథమం-గా మిగిలిన యిద్దరు టీచర్లూ మధ్యాహ్నం బయటకు పోకుండా స్కూల్లోనే ఉండేటట్లు, యిళ్ళకు పోకుండా ఉండే ఆ కొద్దిమంది విద్యార్థులకీ క్లాసులు తీసుకోమని శాసించండి. చూద్దాం ఏం జరు-గుతుందో?"

రామశర్మ వాళ్ళిద్దర్నీ రెండు-సార్లు తీవ్రంగా హెచ్చరికచేసి,

మూడోసారి క్రమశిక్షణారాహిత్యానికి లిఖితపూర్వకంగా నోటీసు అందజేసి. దాని కాపీని మునిసిపల్ విభాగానికీ, జిల్లా విద్యాధికారికీ పంపించాడు.

ఆ సమయంలోనే రెండు సంఘటనలు జరిగాయి. ఒక రోజు ప్రసాద్ సెలవు పెట్టి రాలేదు. నాగరాజు తరగతి గదుల్లో అష్టావధానం చేస్తూ తిరిగి వచ్చి, తను సైన్స్ పాఠం మొదలుపెట్టిన ఏడో తరగతి గదికి వచ్చాడు. తలనొప్పి విపరీతంగా బాధిస్తోంది."-శంకర్! తలనొప్పి విపరీతంగా ఉంది. వీధి మలుపులో ఉన్న మందుల దుకాణానికిపోయి ఓ నాలుగు అన్పో మాత్రలు తీసుకురా?" అని అయిదు రూపాయల నోటు అందించాడు. శంకర్ పోయి అయిదు నిముషాల్లో మాత్రలు తీసుకు వచ్చాడు. ఓ రెండు బిళ్ళలు మింగి, పది నిముషాల తర్వాత కాస్త తేరుకొని, తిరిగి పాఠం చెప్పడం మొదలు పెట్టాడు. అదే మధ్యాహ్నం ఓ పెద్దమనిషి వచ్చి, నలుగురిమధ్య తన యింటినుంచి తీసుకొచ్చిన స్టెయిన్లెస్ స్టీలు కంచంలో భోజనం చేస్తున్న ఓ కుర్రవాడిని బలవంతంగా లేవదీసి, తనకొడుకుని అందరిమధ్యా కూర్చోబెట్టి తన సామాజిక వర్గాన్ని కించపరుస్తున్నారని నానా రాద్ధాంతమూ చేశాడు.

విషయం స్థానిక దినపత్రికలకెక్కింది. స్కూలు విద్యార్థుల్ని నాగరాజనే టీచరు స్వంత పనులకు వాడుకొంటున్నాడనీ, కావాలనే అగ్రవర్ణ విద్యార్థుల్ని నిమ్నవర్గ విద్యార్థుల పక్కన బలవంతంగా కుదేసి భోజనాలు పెడ్తున్నారని చిలవలు పలవలుగా కథనాలు వచ్చాయి. దీని వెనుక కామేశం, ప్రసాద్ ల హస్త ముందని రామశర్మకీ, నాగరాజుకీ తెలుసు.

ప్రధాన దినపత్రికలు కూడా ఆజ్యం పోస్తూ మొత్తం మునిసిపాలిటినే ఎటాక్ చెయ్యడంతో, ఓ చిన్నస్థాయి విచారణ సంఘం వచ్చి పరిస్థితుల్ని పరిశీలించి, వాస్తవాల్ని గ్రహించినట్లు నటించింది. ఎందుకంటే మధ్యాహ్నభోజన పథకాలున్న అన్నీ స్కూళ్లలోనూ మధ్యాహ్నం తరగతులకి విద్యార్థులు డుమ్మా కొట్టడం పరిపాటేనని వాళ్ళకి తెలియంది కాదు. విచారణ సంఘంవారి నివేదికను బుట్టలో పడేసి, మున్సిపల్ కమిషనర్ ఎమ్ ఏమ్ ఎస్ -4 స్కూలుకి ఓ మధ్యాహ్నం హఠాత్తుగా వచ్చాడు. ఆయన అర్నెల్ల క్రితం శ్రీకాకుళం నుంచి బదిలీ మీద వచ్చాడు. ఆయనకి అదే మొదటిసారి ఆ స్కూల్ని సందర్శించడం. వచ్చిన కొత్తలో నగరం మధ్యలో ఉన్న రెండు స్కూళ్ల తాలూకు ఫైళ్లని చూపిస్తే సంతృప్తి వ్యక్తం చేశాడు. ఇప్పుడు ఈ స్కూలుని స్వయంగా చూసి పరిస్థితుల్ని అర్థం చేసుకొన్నాడు. విద్యార్థులు మురళి, శంకర్ కమిషనర్ కి ఇటీవల జరిగిన సంఘటనలు వివరించి, స్కూలు పరిస్థితిని చెప్పారు. కమిషనర్ శ్రద్ధగా ఆలకించాడు. మధ్యలో అడిగిన ప్రశ్నలకి వారు ధీమాగా సమాధానాలు చెప్పారు.

"రెండువందలు దగ్గరగా విద్యార్థుల సంఖ్య. ఎనిమిది తరగతులు. ఉన్నది పేరుకి నలుగురు ఉపాధ్యాయులు. భోజనం నాసిరకం. అదీ మీరిచ్చే రేషన్లతోటే సరిపుచ్చుకోవాలి. ఆ మాత్రపు భోజనానికే మొదటి పూట విద్యార్థులు వస్తున్నారు. రెండో పూటకి క్లాసుల్లో ఉండకుండా మాయమైపోతున్నారు. వారితోబాటు ఇద్దరు టీచర్లు గైర్హాజరైపోతున్నారు. పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడితే వారి తలకెక్కటంలేదు. కార్మికనాయకులు తలనొప్పి కలిగిస్తున్నారు. భోజనాల తంతు చూడ్డానికే నా సమయమంతా గడిచిపోతోంది. బుద్ధిమంతులైన కొందరు విద్యార్థులు ఉండిపోతున్నా వారికి పాఠాలు చెప్పడానికి నాతో సహా ఇద్దరం మిగులుతున్నాం. పదో తరగతివరకూ డిటెన్షన్స్ లేని కారణంగా విద్యార్థులూ లెక్కచెయ్యటల్లేదు, ఉపాధ్యాయులూ లెక్కచెయ్యటల్లేదు! చెప్పండి ఏం చెయ్యాలో?" అన్నాడు రామశర్మ.

"ఇంతవరకూ నా దృష్టికి ఈ విషయం ఎందుకు తీసుకు రాలేదు?" ఆయన ప్రశ్నించాడు.

రామశర్మ తన చేతి సంచిలోంచి రెండు నలిగిన దస్త్రాల్ని ఆయన ముందుంచాడు. "ఎన్నిసా-

ర్లు మునిసిపాలిటీ వారి దృష్టికి తీసుకువచ్చామో ఈ దస్త్రాలే చెపుతాయ్ సార్!"

"పరిష్కారం? ఆ యిద్దరు టీచర్లనీ సస్పెండ్ చేస్తూ ఆఫీసుకు వెళ్ళగానే ఆర్డర్లు పంపిస్తాను. మరి పిల్లల సంగతి?"

"సర్! అర్హతలు సంపాదించిన తర్వాత మూడు సంవత్సరాలు వేచి ఉంటే కానీ ఈ ఉద్యోగం దొరకలేదు. నాకు విద్యాబోధన అంటే ప్రాణం. అందుకనే సురేంద్రసింగ్ గారి ఖర్ఖానాలోని ఉద్యోగం వదిలి ఈ ఉద్యోగంలో చేరాను. ఆయన ఈ నగరం తనకి ఆసరా కల్పించిందన్న కృతజ్ఞతతో మంచి నీటి టాంక్ రాత్రికి రాత్రి అమర్చాడు. ఆయన స్నేహితుడు ఉచితంగా బోరు బావి తవ్వించాడు. వార్డులో పైపుల చందాలకోసం వెడ్తే గోదావరి నీళ్లివ్వని మునిసిపాలిటికి తామెందుకు సహాయం చేయాలని తిట్లు తిట్టారు. ఇస్కాన్ వారు పైపులు. మోటారూ కొనిచ్చారు. స్కూలుకి బాగులు చేయించి వెల్లలు వేశారు. మధ్యాహ్నభోజనం తర్వాత ఉడాయించే విద్యార్థులకు ఆ సదుపాయం కల్పించబోమనీ, రెండు పూట్లా తగినంత అటెండెన్స్ లేకపోతీ ఆ విద్యార్థుల్ని తొలగిస్తామనీ హుకుం జారీ చేయండి. ఉపాధ్యాయుల ఖాళీలని వెంటనే భర్తీ చేయండి. ప్రాంగణం లేని ఈ స్కూలుకి ఎత్తైన ప్రహరీ నిర్మించి, పక్కా గేటు నిర్మాణం చేయించండి. రాజస్తాన్ వ్యాపారి సేఠ్ శ్రీ రామ్ లాల్ ఈ భవనాన్ని నగర మునిసిపాలిటీకి ధారదత్తం చేశారని రామశర్మ గారు చెప్పారు. కనీసం స్కూలు ప్రాంగణాన్ని పరిరక్షించే ఏ ప్రయత్నమూ మునిసిపాలిటీ చేయలేదని చెప్పడానికి సాహసిస్తున్నాను. ఆరోతరగతి వరకూ విద్యార్థులు నేలమీదే కూర్చుంటున్నారు. ఏ గదిలోనూ ఫర్నిచర్ అన్నది లేదు. మేస్టరు చెప్పింది వినడం, బోర్డు మీద రాసింది చూడ్డం మెడఎత్తి చెయ్యాలి. ఏం రాసుకోవాలన్నా మెడ దించి రాయాలి. ఇది ఎంత కష్టమో ఆలోచించండి సార్? విద్యార్థులకి ధ్యాస కుదిరేదెప్పుడు, దస్తూరీ బాగుపడేదెప్పుడు?" నాగరాజు సందేహించకుండా తన మనసులో ఉన్న మాట చెప్పేశాడు.

" ప్రభుత్వం ప్రకటించే రాయితీ విధానాలకీ, ఇతర ప్రజాకర్షణ పథకాలకీ మేము కొమ్ము కాయాలి. మా డ్యూటి అంతా ఆసిధారా వ్రతమే! ఉద్యోగాలు రానంతవరకూ గోలచేసి, తీరా వచ్చిన తర్వాత వార్డ్ మెంబర్ల వెనకా, ఛైర్మన్ వెనకా నక్కి, తమ తమ పోస్టింగ్ లను నిర్ధారించుకొనే ప్రయత్నాల్లో ఉన్నారని తెలిసింది. రేపటికల్లా పది మందికి మీ స్కూల్లో జాయినవాల్సిందిగా ఆర్డర్లు పంపిస్తాను. ప్రహారీ గోడ నిర్మాణానికి, టాయిలెట్లకీ స్పెషల్ శాంక్షన్ జారీ చేస్తాను. అన్నీ హంగులతోటీ మంచి వంటశాలకి కూడా శాంక్షన్ చేస్తాను. మునిసిపల్ బుల్ డోజర్ని పంపిస్తాను. రాళ్లూ, రప్పలూ తొలిగించి వీలైనంత భాగాన్ని చదును చేసి ఆటస్థలాన్ని ఏర్పాటు చేసుకోండి. స్కూళ్ళకి ఇచ్చే రేషన్లని కొందరు వార్డ్ మెంబర్లూ, కొందరు స్కూలు టీచర్లూ పందికొక్కుల్లా తిని బలుస్తున్నారని కొన్ని ఆధారాలు దొరికాయి. వారిమీద చర్యలు తీసుకోడానికి ఉపక్రమించాను. తక్షణ చర్యలకి రాజకీయాలడ్డొస్తున్నాయి. త్వరలోనే రేషన్ల విషయమై వృద్ధి తీసుకొస్తాను."

"ప్రహరీ గోడ నిర్మాణం డిపార్ట్మెంట్ ద్వారా చేయించండి సర్! రాళ్ళక్వారిలోని కార్మికులు ఓ పదిమందిని రోజువారీ కూలీ మీద తీసుకొంటే పది రోజుల్లో నిర్మాణం జరిగి పోతుంది. నేను దగ్గరుండి సూపర్వైజ్ చేస్తాను. ఆ తర్వాత విద్యార్థుల్నీ, వారి తల్లిదండ్రుల్నీ క్రమంగా దారిలోకి తీసుకు రావొచ్చు," అన్నాడు నాగరాజు.

" మీకు తెలియని సంగతి చెబుతున్నాను వినండి. నగరంలోని ప్రాథమిక, మిడిల్ స్కూళ్ళలో మధ్యాహ్న భోజన పథకం తాము స్వంత ఖర్చులతో నిర్వహిస్తామని ఇస్కాన్ ముందుకొచ్చింది. ఇది మంచిదేనని నేను రాష్ట్ర కేంద్రానికి ఉత్తరం రాశాను. జవాబు కూడా వచ్చింది, చూడండి," అని కమిషనర్ తన బ్రీఫ్ కేసు తెరిచి ఓ ఉత్తరం నాగరాజుకి అందించాడు.

'మీ సిఫారసు బాగానే ఉంది కానీ, ప్రతి పక్షాలవారూ, లౌకికవాదులూ హైందవ సంప్రదాయాల్ని పాటించే ఒక సంస్థకి ప్రత్యేక పక్షపాతం చూపిస్తున్నారని రాద్ధాంతం చేస్తారు. అందుకని ఇస్కాన్ వారి అభ్యర్థనని తిరస్కరించండి. స్కూలు ప్రాంగణంలో బోరుబావికి ఇస్కాన్ పైపులు, మోటారూ ఇచ్చినట్లు మా దృష్టికి వచ్చింది. ఆ ఖర్చుల్ని మీరు వారికి వెంటనే చెల్లించి రశీదు తీసుకోండి!' నాగరాజు ఉత్తరాన్ని చదివాడు. ఆ తర్వాత అన్నాడు. "మీది నిజంగానే ఆసిధారావ్రతం సర్! మనసులో మెదిలిన మాటల్ని నేరుగా చెప్పే-సినందుకు క్షమించండి. ప్రతీ పథకం వెనకా ఓట్ల లక్ష్యమేనని ఇప్పుడు పూర్తిగా అర్థమైంది. విద్యార్థుల్ని దారిమళ్లించి చదువు మీద శ్రద్ధ వహించే ప్రయత్నాలు జాగరూకతతోనే చేస్తాం!" అన్నాడు నాగరాజు.

"నూటికి నూరు శాతం అందరూ ఒకే స్థాయికి ఎదగలేరు. సమాజానికి గుంజల్లా కొందరు తమంత తాముగానే, లేక కొద్దిపాటి ప్రోత్సాహంతో ఎదుగుతారు. ఈ మీ మురళి, శంకర్ అటువంటివారే! ఇటువంటి-వారి స్ఫూర్తితో ఇతర విద్యార్థులకు చదువుమీద శ్రద్ధ పెరిగే అవకాశం తప్పక ఉంటుంది. ఏ సమస్య వచ్చినా నేరుగా నావద్దకి రండి!" అని కమిషనర్ అందరితో కరచాలనం చేసి, మురళి, శంకర్ ల భుజాలు ఆప్యా-యంగా తట్టి కదిలాడు.

ఏడాదిలోపుగా నాలుగో నెంబరు మునిసిపల్ మిడిల్ స్కూల్ అన్నీ విధాలా అభివృద్ధి చెందింది. ఇప్పుడు ఆ స్కూల్లోని విద్యార్థుల సంఖ్య తరగతికి నలభై చొప్పున 320. దాన్ని సేఠ్ శ్రీ రామ్ లాల్ నగరపాలిక ఉన్నత పాఠశాలగా మార్చే దిశలో కమిషనర్ చర్య తీసుకొన్నాడు. పథకాలూ, ప్రణాళికలూ కాయితాలమీద గొప్ప-గానే ఉంటాయి. అయితే ఆచరణలో అడ్డంకుల్ని ఎదుర్కొనే నాగరాజు లాంటి ధీశాలురు లేకపోతే ఆ కాయితలమీది నల్లటి అక్షరాలకి వికృతమైన రూపం వస్తుందే తప్ప, పటిష్టమైన వ్యవస్థ కాదు. *

# భారతీ 'స్ కిచెన్



| | |
|---|---|
| బీరకాయలు | 1/4 కిలో |
| వేరుశెనగ గుళ్ళు | 1/4 కప్పు |
| నువ్వులు | 3 చెంచాలు |
| ఉప్పు | 1/2 చెంచా |
| చింతపండు | కొద్దిగా |
| పచ్చిమిరపకాయలు | 4 లేదా 5 |
| వెల్లుల్లి | 8 రెబ్బలు |
| పసుపు | చిటికెడు |

పోపుకు : కరివేపాకు, ఎండు-మిర్చి, ఇంగువ, ఆవాలు,

నూనె : వేయించడానికి సరిపడా

ముందుగా కడిగి శుభ్రపరచిన బీరకాయల్ని తొక్కతో సహా... మధ్య ఈనెలు మాత్రం తీసి ... సన్నగా పొడవుగా ముక్కలుగా తరుగుకుని , మూకుడులో నూనె వేసి ... ముక్కల్ని, పచ్చి మిర్చి, వెల్లుల్లి, జీలకర్రతో సహా వేసి, కమ్మని వాసన వచ్చేవరకు మగ్గ-నిచ్చి, పసుపు, ఉప్పు చేర్చాలి. అవి చల్లారేలోపు... ప్రక్కన ఇంకో పొడి మూకుడులో వేరుశెనగ గుళ్ళు దోరగా వేయించుకోవాలి. ఆ వేడి మూకుడులో నువ్వులు కొద్దిగా చిటపటలాడేలా వేయించుకో-వాలి. చింతపండు కొద్దీ నీళ్లలో నానబెట్టి గుజ్జు తీసుకోవాలి. అన్నీ కలిపి మెత్తగా రుబ్బుకోవాలి. ఈ పచ్చడికి పై పోపు కరివేపాకు, ఆవాలు, ఎండు మిర్చి, ఇంగువ వేసి, వేయించి పైన వేసుకోవాలి.

ఈ చట్నీ దోసెలలో, ఇడ్లీలలోకి చాలా చాలా బావుంటుంది.

వచ్చే నెల మరొక కమ్మని వంటతో

మీ, పమ్మి భారతీ శర్మ

# ప్రహేళిక

## జవాబు చెప్పగలరా?

ఈ క్రింది వాక్యములలోని ప్రతి అక్షరము, అసలు అక్షరమునకు బదులు వేరే అక్షరము వాడబడినది. ఉదాహరణకు, 'క' అనే అసలు అక్షరం బదులు 'ర' అనే అక్షరం వాడారని మీరు అనుకుంటే, ఈ వాక్యములలో ఎక్కడ 'ర' వచ్చినా దాని అసలు అక్షరం 'క' మాత్రమే అవుతుంది. వత్తులు, గుణింతాలు అన్నీ అన్వయిస్తాయి.

మీరు చెయ్యవలసినదల్లా అసలు వాక్యాన్ని కనుక్కోవడమే. ప్రయత్నించండి.

**( ఆధారం : ల = అసలు అక్షరం 'ర' )**

**మంసోతింషిసి షాయుషాయు లసిలా రజ్వాల మౌఛ్పంగుయవ్**
**బాంసివ్ గొంజిసి షాయుషాయు గశులా రజ్వాల మౌఛ్పంగుయవ్**
**బాంసింగొంజెజ రూటు గ్లశ్నటజలా రజ్వాల మౌఛ్పంగు వి**
**భ్షింసవ్ బాంసుణవౌజు వీ చలుడషే .......**

(మీ జవాబు teega51@ gmail. com కి పంపించండి.)

**గతనెల జవాబు :**

వనజభవుండు కోపమున వాహనమైన మరాళభర్తకున్
వనజవనీవిహారకలనంబు దొలంగగజేయుగాని గుం
భనమున దుగ్ధజీవన విభాగ విధాన నిరూఢ నైపుణీ
జనిత మహాయశో విభవసారము హంసకు మాన్పజాలునే

జూన్ నెల ప్రహేళికకు సరియైన జవాబు పంపినవారు:



శ్రీ వేదుల సుబ్రహ్మణ్యం



శ్రీ కె మురళీమోహన్

# కొత్త రామానందం
# జగన్నాథ రథోత్సవం



**అయోధ్యా మధురా మాయా కాశీ కాంచి అవంతికా|**
**పూరీ ద్వారావతీశ్చైవ సప్తైతే మోక్షదాయికాః ||**

భారతదేశంలోని సప్తదాయ క క్షేత్రాలలో ఒకటిగా భక్తకోటి చెప్పుకునే పరమ పుణ్యతీర్థం. ఆ పవిత్రధామం ఓ డ్ర దేశంలో (ఒడిశా) లో ఇల వైకుంఠ పురంగా వెలుగుతోంది. ప్రధాన ఆలయం ఎత్తు 214 అడుగులు ఏ ఆధారాలు లేనికాలంలో అంట ఎత్తైన గోపురనిర్మాణం ఆశ్చర్యం కలిగించకమానదు. భగవంతునికి ఉదయం 5 గం ||ల నించి వివిధ పూజలు, అలంకారములు, నివేదనలు రాత్రి 9 గం ||లకు వివిధరకాల సేవలు జరుగుతుంటాయి.

క్షేత్రానికి, దైవానికి కూడా ప్రాధాన్యమున్న పుణ్యక్షేత్రం ఇది. దీనికి శ్రీ క్షేత్రమని, పురుషోత్తమపురమని, నీలాచల క్షేత్రమని కూడా పేర్లు ఉన్నాయి. పన్నెండు సంవత్సరాల కొకసారి కొత్త విగ్రహాలను మొదటి విగ్రహాలను చేసిన పద్ధతిలోనే చేస్తారు. పాతవిగ్రహాలను మంత్రపూతంగా అగ్నికి ఆహుతి చేస్తారు. ఆ భస్మాన్ని పవిత్రమైనదిగా భక్తులు భద్రపరచుకుంటారు. ప్రతి పన్నెండు సంవత్సరాలకి ఒకసారి ప్రత్యేకమైన అటవీ ప్రాంతం నుంచి తీసుకువచ్చిన వేపచెక్కతో ఈ దేవాలయ విగ్రహాలను చెక్కుతారు. ప్రత్యేకమైన పద్ధతి ద్వారా ఈ విగ్రహాలను మారుస్తారు. దానినే 'నాబా కళేబరా' అంటారు. ఇది తరతరాలుగా వస్తున్న ఆచారం.

పురాణపురుషులు కొంతమంది ద్వారకనుంచి తూర్పు ప్రాంతానికి వచ్చినప్పుడు వారు తమతో పాటు శ్రీ కృష్ణుడు నిర్యాణం చెందిన తరువాత అవశేషాలను తీసుకువచ్చారు. ఈ దేవాలయ నిర్మాణకాలం నుంచి ఇప్పటివరకు ఆ గుడిలోని విగ్రహంలో ఉన్న ఒక ఖాళీ ప్రాంతంలో ఈ అవశేషాలను ఉంచుతారు. అలాగని ఇది ఒక రహస్యము కాదు. స్థలపురాణం ఆధారంగా ఆ ప్రాంతంలోని ప్రజలందరికీ ఈ విషయం బాగా తెలుసు. మరల 12 సం కాలం వచ్చేవరకు వీటిని దాచివుంచిన విషయం మరచిపోతారు. ఈ అవశేషాల మూట మార్పిడి ఆ దేవాలయంలోని అతి వృద్ధ బ్రాహ్మణుడు కళ్ళకు గంటలు కట్టుకుని చేస్తాడు. ఏంతో ప్రముఖమైన మరియు నియమనిష్టలు కలిగిన ఈ కార్యక్రమం శాస్త్రపరిజ్ఞానానికి అందనిది. ఇవి ఉన్నాయి అనే విషయం ప్రతి 12 సం ||లకు ఒకసారి జరిగే ఈ ఉత్సవం ద్వారా అందరికి గుర్తు వస్తుంది. కానీ లక్షలమంది భక్తుల ద్వారా ఏంతో గొప్పగా పూజింపబడతాయి.

శ్రీకృష్ణునికి అంకితమైన పురా



తన నగరమే పూరి. మరియు ఇక్కడ నివాసముంటున్న ప్రజలు తమతోపాటు శ్రీకృష్ణుని బ్రజ్ లోని చిన్ననాటి గాథలనుండి ద్వారకలో గడిపిన రోజులవారాలూ అన్ని జ్ఞాపకాలను ఇక్కడకు తీసుకువచ్చారు.

చిన్నతనంలో శ్రీకృష్ణుడు పాలు, వెన్న, మీగడలు దోచుకున్నాడనటానికి ప్రస్తుతం ఈ దేవాలయంలో చేసే పూజావిధానమే సాక్ష్యం. ఈ దేవాలయంలో జరిగే పూజావిధానంలో ముఖ్యంగా సమర్పించేది ఒరిస్సా ప్రజలు పాలు మరియు బియ్యంతో తయారుచేసే తియ్యటి క్షీరాన్నం. ఇప్పటికీ ఎంతో ఇష్టంగా "ఖేరీ చోరా" అని పిలుస్తారు. అనగా క్షీరాన్నం దొంగిలించేవాడని అర్ధం.

జగన్నాథ క్షేత్రంలో నాగరిక, వనవాసి సంస్కృతుల సమ్మేళనం కనబడుతుంది. రథయాత్రలో కూడా వైదిక సంప్రదాయరీతులు, ఆటవిక తేగల రీతి రివాజులు దర్శనమిస్తాయి.

సాధారణంగా ఏకాడైనా దేవాలయంలో స్వామి వారి పక్కన అమ్మవారు ఉండటం సహజం కానీ, పూరీలో మాత్రం గర్భాలయంలో రత్నవేదిక మీద జగన్నాధుడి ప్రక్కన సోదరుడైన బలరాముడు, సోదరి సుభద్ర ఉంటారు. వారితోపాటు సుదర్శన చక్రం, మదనమోహనుడు, శ్రీదేవి, విశ్వధాత్రి కూడా ఉంటారు.

ఆలయంలోని గర్భగుడియందు 'రత్నపీఠిక' లేక 'శ్రీపీఠం' పై ఉన్న జగన్నాధుడు, ఆయన సోదరుడు బలభద్రుడు, సోదరి సుభద్ర ఆకృతులు విచిత్రంగా ఉంటాయి. ఈ విగ్రహాలకు చేతులుండవు. అలాగే ఈ ముగ్గురు మూర్తులకు చెంపలకు చారడేసి కళ్ళు , ఈ చివరినుండి ఆ చివరి వరకు విస్తరించి ఉంటాయి, జగన్నాధుడి ముఖం నల్లగా చంద్రబింబంలా ఉండగా, బలభద్ర, సుభద్రాల విగ్రహాలు చిన్నవిగా తెలుపు, పసుపు రంగుల్లో కనిపిస్తుంటాయి. ఈ మూడు మూర్తులకు శిరస్సు మీద ఒక్కొక్క వజ్రం

ఉంటుంది. విశేషమేమిటంటే ఈ విగ్రహాలు వేప చెక్కతో తయారయివుంటాయి.

జగన్నాథుడు భోజనప్రియుడు. మామూలుగా తొమ్మిది గం॥లకు ఉపాహారంతో ప్రారంభించి, ఇంచుమించు ప్రతి గంటకు ఆయనకు 64 రకాల పిండివంటలు కట్టెల పొయ్యిమీద వండి, వివిధ భోగాల పేరుతో నైవేద్యంగా పెడతారు. స్వామి రాజభోగముగా, చిరుతిళ్ళుగా ఆరగిస్తుంటారట. స్వామికి నివేదించే అన్నాన్ని మహాప్రసాదం అనే పేరుతో పిలుస్తారు. ఆలయప్రాంగణంలో ప్రసాదాలు విక్రయించే ప్రదేశాన్ని ఆనందబజార్ అంటారు. ప్రతి భక్తుడు విధిగా ఆ ప్రసాదాన్ని తింటారు. స్వామివారికి రోజూ ఐదారుసార్లు దుస్తులను, ఆభరణాలను మార్చుతారు.

ప్రసిద్ధ పూరీ శ్రీక్షేత్రం జగన్నాథుడు శృంగార, అలంకార, భోజనప్రియుడని భక్తులంటారు. 'జగత్' అనే మాటకు అర్థం ప్రపంచము. విశ్వము నిరంతరం చాలించేది మరియు ఎప్పటికీ లాగండి అని అర్థం. నాథ్ అనగా భగవంతుడు. జగన్నాథ్ అనగా ఈ విశ్వానికే భగవంతుడు.

స్వామివారి సన్నిధిలో నిత్యం ఉత్సవాలు, ఏడాదిలో 13 ప్రధాన ఉత్సవాలు, నాలుగుసార్లు రథాలపై ఊరేగుతారు స్వామి. ఈ వేడుకల్లో నవరత్నాలు పొదిగిన స్వర్ణాభరణాలను స్వామివారి రత్న భాండాగారం నుంచి తెచ్చి అలంకరిస్తారు. జగన్నాథుని సేవకులమని చెప్పుకున్న పూరీ రాజులు అప్పట్లో యుద్ధాలు చేసి విజయాలు సాధించి తెచ్చిన సంపదనంతా స్వామివారి భాండాగారంలో ఉంచారని చరిత్రకారులు చెబుతారు. ఇందులో వెలకట్టలేని 598 రకరకాల ఆభరణాలు, కిరీటాలు ఉన్నాయని తెలుస్తోంది.

### గుండీ చాయాత్ర

గుండీచాయాత్ర , ఘోషయాత్ర, నవడినయాత్ర, దశావతార యాత్ర అనే పేర్లున్న 'జగన్నాథ రథోత్సవం ప్రపంచంలో అతిపెద్ద రథయాత్ర. కన్నుల పండుగగా జరిగే ఈ ఉత్సవాన్ని చూడటానికి దేశదేశాలవారు వస్తారు. కొన్ని లక్షల మంది ఈ ఉత్సవంలో పాల్గొని తమ జీవితం ధన్యమైనదని భావిస్తారు. దీనికి కారణం ఈ రథయాత్రలో కనిపించే ఎన్నో వేడుకల ప్రత్యేకతలే.

సాధారణంగా ఏ ఆలయములోనైనా అభిషేకాలు, కల్యాణాలు, ఊరేగింపులు ఇతర ఉత్సవాలు ఉత్సవ విగ్రహాలకు చేస్తారు. కానీ ఈ రథయాత్రకు మూలవిరాట్టే కదలిరావటం విశేషం. ఏ ఉత్సవమైనా శుభమాసాల్లో జరగడమనేది అనాదిగా వస్తున్న సాంప్రదాయం. అయితే, పూరీక్షేత్రంలో శూన్యమాసమయిన ఆషాడ మాసంలో జరుపుతారు. గర్భాలయంలో ఉన్న ముగ్గురు దేవతలను మూడు శబరి జాతివారు (పండాలు) బహు జాగ్రత్తలు తీసుకుని, కోలాహల వాతావరణంలో మూర్తులను గర్భగుడి నుంచి కదిలించి వాటిని ఊరేగింపుగా రథం వద్దకు ఒక్కొక్కరుగా తీసుకువచ్చి రథంలోని రత్నపీఠంపై అలంకరింపజేస్తారు. ఈ ఉత్సవాన్ని 'పహండే' అంటారు.

జగన్నాథుడు గుండీచా లోని తోట బంగ్లాలో అడపా మండపంలో ఒకవారం రోజులు సోదరి సుభద్ర, సోదరుడు బలరాముడితో ఆనందంగా గడుపుతారు. అందు నిమిత్తం ప్రతి సంవత్సరం రథ నిర్మాణాలు జరుగుతాయి.

### చందనయాత్ర

రథనిర్మాణం కార్యక్రమం అక్షయ తృతీయ నాడు పూరీ రాజభవనం ఎదుట అగ్నికార్యం చేసి ప్రారంభం చేస్తారు. ఇది మూడు వారాలపాటు సాగుతుంది. వీటిని పూర్వపు దసపల్లా రాజ్యం నుండి వంశపారంపర్యంగా ఈ రథాలు చేసే వడ్రంగుల కుటుంబాలకు చెందినవారు తీసుకురావడం సంప్రదాయం. వాటిని ఎంపిక చేసిన తరువాత కట్టగా కట్టి మహానాడులో వేస్తారు. నదిలో తేలి వస్తే, పూరీ సమీపంలో వాటిని సేకరించుకుని పూరీకి చేరుస్తారు.

### స్నాన యాత్ర

చందనోత్సవం జ్యేష్ఠ పూర్ణిమ నాడు జరిగే స్నానయాత్రతో ముగుస్తుంది. ఆ రోజునుండి రెండు వారాలపాటు దేవతామూర్తులు కోలుకుంటున్నట్టు పరిగణించబడతారు. భక్తులకు దర్శనాలు ఉండవు. ఆ సమయంలో ఆకులు, పళ్ళు, దుంపలు వంటివి మాత్రమే నివేదన చేస్తారు. ఆరోగ్యంగా లేరు కదా! కోలుకున్న దేవతామూర్తులకు తాజాగా రంగులు వేస్తారు. కళ్ళకి సాంప్రదాయానుసారం రంగులు వేయడాన్ని నేత్రోత్సవం అంటారు. నేత్రోన్మీలనంతో దేవతామూర్తులు పూర్తిగా కోలుకొన్నట్టే. ఈ దర్శనాన్ని నవయవ్వన దర్శనం అంటారు. అప్పటికి అసలైన, అందరూ ఎదురుచూసే సమయం ఆసన్నమవుతుంది.

### రథయాత్ర

ఆషాఢ శుద్ధ ద్వితీయనాడు ఎంతో ఉత్సుకతతో ఎదురుచూస్తున్న రథయాత్ర ప్రారంభమవుతుంది. దేవతామూర్తులు గర్భాలయంలో కాక జగమోహన మండపంలోని ఉంటారు. ముందుగా సుదర్శనుడు కదిలి సుభద్ర రథంలో చేరుతాడు. వెనువెంటనే బలభద్రుడు, తరువాత సుభద్ర, చివరగా జగన్నాథుడు రథారూఢులవుతారు.

సుభద్ర రథం పేరు దర్పదళనం. దీని ఎత్తు 43 అడుగులు



ఉంటుంది. ఆ రథానికి పన్నెండు చక్రాలు ఉంటాయి. రథం పైభాగం ఎరుపు, నలుపు రంగువస్త్రంతో అలంకరిస్తారు. నాలుగు ఎరుపు రంగు గుర్రాలు అమర్చుతారు. రథసారథి అర్జునుడు.

బలభద్రుని రథం తాళధ్వజం. దాని ధ్వజం మీద తాడిచెట్టు ఉంటుంది.44 అడుగుల ఎత్తు, పదునాలుగు చక్రాలు, ఎరుపు, నీలం రంగుల వస్త్రంతో రథం పైభాగాన్ని అలంకరిస్తారు. నాలుగు తెల్లని కొయ్యగుర్రాలు లాగుతున్నట్టు కానవస్తుంది. ఈయన రథానికి సారథి 'దారుకుడు'.

జగన్నాథుని రథం పేరు 'నందిఘోష'. 45 అడుగుల ఎత్తు, 16 చక్రాలు, రథం పైభాగం ఎరుపు, పసుపు రంగుల వస్త్రంతో అలంకరించబడి ఉంటుంది. నాలుగు నల్లని కొయ్య గుర్రాలు పూనిచిఉంటాయి. సారథి పేరు 'మాతలి'.

పరమాత్మ ముందు సేవకుడిగా మారిన పూరీ మహారాజు బంగారు చీపురుతో రథాల లోపల ఊడ్చిన పిమ్మట (చెరా సహరా) కళ్ళాపు జల్లి, హారతిచ్చి 'జై జగన్నాథా' అని నినదిస్తూ రథానికున్న తాళ్లను లాగడంతో రథయాత్ర మధ్యాహ్నం సుమారు రెండు గంటలకు ప్రారంభం అవుతుంది. రథాలను లాగి జగన్నాథుని సేవలో పునీతం కావాలనే తపనతో అందరు భక్తులూ ప్రేమతో లాగుతారు. అన్నాచెల్లెళ్ల ఆత్మీయానురాగాలకి, విశ్వమానవ సౌభ్రాతృత్వానికి ఈ రథోత్సవం ఒక ప్రబల తార్కాణం. ఆ స్వామి రథంపై వస్తుండటాన్ని చూస్తే 'సర్వం జగన్నాథం' అనిపిస్తుంది. అంటే ఈ సమస్త ప్రాణులంతటా ఆయన ఉన్నాడన్నమాట. జగన్నాథుణ్ణి రథంలో ఊరేగుతున్నప్పుడు చూస్తే మరో జన్మంటూ ఉండదని శాస్త్రవచనం.

- జై జగన్నాథా !

# జనార్ధన ఠాకూర్

## జూలై 2018 లో మీ రాశి ఫలాలు



**జూలై నెలలో:**
రవి 17 వరకు మిథునంలో తదుపరి కర్కాటకంలో, బుధుడు కర్కాటకంలో, కుజుడు మకరంలో, శుక్రుడు 4 వరకు కర్కాటకంలో, తదుపరి సింహంలో, శని ధనస్సులో, రాహువు కర్కాటకంలో, కేతువు మకరం లో

9963933371, 9490189713

**మేష రాశి:**
ప్రతి పనియందు సమయస్ఫూర్తిని ప్రదర్శిస్తారు. పై అధికారుల మన్ననలను పొందుతారు. ఆర్థికంగా అనుకూల సమయం. కొద్దిపాటి శారీరక రుగ్మతల వలన బాధపడుదురు. ఉదర సంబంధిత వ్యాధులవలన బాధపడుదురు. సంతాన నిమిత్తం ప్రయాణము చేయవలసివచ్చును. బంధుమిత్రుల వలన సౌఖ్యము పొందుతారు. ప్రచురణరంగంలో వారికి కొంతవరకూ గడ్డుకాలం. మిగతా వ్యాపారస్తులకు లాభదాయకంగా ఉండును. విద్యార్థులు ఏకాగ్రతతో చదువు యందు మనసు నిలిపినచో ఉత్తమ ఫలితాలు పొందుతారు. ముఖ్యమైన కార్యక్రమాలు 22, 23 మరియు 24 వ తేదీలలో వాయిదా వేయుట శ్రేయస్కరం.
వైదిక సూచన:
1) ఆదిత్య హృదయ స్తోత్ర పారాయణం,
2) మంగళవార నియమం పాటించుటద్వారా ఉత్తమ ఫలితాలు పొందుతారు.

**వృషభరాశి:**
కుటుంబగౌరవం కోసం శ్రమించవలసి వస్తుంది. అష్టమ శని ప్రభావము వలన అధిక ఖర్చులు అగుటకు అవకాశం కలదు. ఆర్థిక విషయాలలో ఆచితూచి అడుగు వేయవలెను. ఋణ ప్రయత్నాలు చేస్తారు. బయట వ్యక్తులతో జాగ్రత్తగా మెలగవలెను. స్వ ఆరోగ్య విషయంలో సమస్యలు రావచ్చును. వివాహ ప్రయత్నములకు అవరోధం. ఉద్యోగస్తులకు అధిక శ్రమ. వ్యాపారస్తులకు గడ్డుకాలం. ముఖ్యముగా స్థిరాస్తి రంగంలో ఉన్నవారు జాగ్రత్త వహించవలెను. చివరివారంలో శుభయోగం. ప్రయత్నపూర్వకంగా కార్యసిద్ధి. విద్యార్థులు చెడుస్నేహాలకు దూరంగా వుండి చదువుపై శ్రద్ధ వహించవలెను. 25 మరియు 26 వ తేదీలలో ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదావేయుట శ్రేయస్కరం.
వైదిక సూచన: 1) శనీశ్వర వేదమంత్రం జపించుట 2) విష్ణు సహస్రనామ పారాయణ చేయుట ద్వారా కొంతమేర ప్రతికూలత తగ్గును.

**మిథున రాశి:**
ఈ మాసం ప్రథమ మరియు ద్వితీయ వారాలలో మానసిక చికాకులు, ఊహించని సంఘటనలు కలగవచ్చును. ధనాదాయం సామాన్యం. బంధుమిత్రులతో స్నేహపూర్వకంగా మెలగవలెను. ఉద్యోగస్తులకు, వ్యాపారులకు అనుకూల సమయం కాదు. విద్యార్థులు చదువులో వెనుకబడుట, కంటి మరియు చర్మవ్యాధుల వలన చికాకు కలుగును. చివరి వారంలో శుభవార్తలు మరియు ఆశించిన ప్రశాంతత కలుగును. 27,28 మరియు 29 వ తేదీలలో ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదావేయుట శ్రేయస్కరం.
వైదిక సూచన: 1) అఆదివారం నాడు సూర్య గాయత్రి మననం చేయుట 2) సుబ్రహ్మణ్య ఆలయ సందర్శన వలన ప్రతికూలత తగ్గును.

**కర్కాటక రాశి :**
ఆకస్మిక సమస్యలవలన సతమతమగుదురు. అకారణంగా మాట పడుటకు అవకాశం కలదు. ఆదాయం సామాన్యం. చేపట్టిన పనులలో జాప్యం జరుగును. ఈ సమయంలో కార్యదక్షత, ఆత్మ-నిగ్రహం అవసరం. ఈమాసంలో భ్రాతృ వర్గ సహకారం అవసరం కలుగును. ఉద్యోగస్తులకు సామాన్యకాలం. సహచరులతో స్నేహముగా మెలగవలెను. వ్యారస్థులకు కొత్త పెట్టుబడులవలన నష్టం వాటిల్లు అవకాశం కలదు. అధిక వేడిమి వలన జ్వరం వచ్చు అవకాశం కలదు. శిరోవేదన మరియు ఛాతీ నొప్పి కలుగవచ్చును. విద్యార్థులు అధిక ఒత్తిడికి గురి అగుదురు. 29,30 మరియు 31 వ తేదీలలో ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదావేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన: 1) బుధవారం నాడు సంకటహర గణపతి స్తోత్ర పారాయణము 2) వెండి ఉంగరం చిటికెన ప్రేలుకు ధరించుట ద్వారా ప్రతికూలత కొంత తగ్గును.

**సింహ రాశి:**
ఆర్థిక పరిస్థితి అనుకూలంగా ఉండును. సకాలంలో పనులు పూర్తి చేయుదురు. నరాల బలహీనత మరియు ఉదరసంబంధిత వ్యాధులవలన బాధపడు అవకాశం కలదు. ఉద్యోగస్తులకు అనుకూలసమయం. పై అధికారుల సహాయ సహకారాలు ఉంటాయి. వ్యాపారస్తులకు ముఖ్యంగా అనుకూల సమయం. చేయు ప్రయాణములవలన లబ్ధి పొందుతారు. 4,5 మరియు 6 వ తేదీలలో ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదావేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన: 1) దుర్గా అమ్మవారి ఆలయ సందర్శనం 2) మేధా దక్షిణామూర్తి స్తోత్ర పఠనము ద్వారా ఉత్తమ ఫలితాలు కలుగును.

**కన్యారాశి:**
ఈమాసంలో వాహన సంబంధ సమస్యలు, ముఖ్యంగా స్త్రీలు జాగ్రత్తగా మెలగవలెను. ఇంటిలో సంతానమునకు ఆరోగ్య సమస్యలు ఉండవచ్చును. మాతృవర్గీయులకు మంచిది కాదు. ఉద్యోగస్తులకు స్థాన చలన సూచనలు, ఆర్థికంగా వెనులుబాటు వలన కొన్ని సమస్యలు అధిగమించుదురు. ఆస్తమా మరియు దీర్ఘకాల వ్యాధులతో బాధపడువారు కాదు జాగ్రత్తగా మెలగవలెను. వ్యాపారస్తులకు, ముఖ్యముగా ఇనుము, నూనె ఉత్పత్తిదారులకు అనుకూలసమయం. విద్యార్థులు అధికశ్రమ ద్వారా ఫలితం పొందుదురు. 7,8 మరియు 9 వ తేదీలలో ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదావేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన: 1) హనుమాన్ చాలీసా పారాయణ చేయుట 2) తరుచుగా గణపతి ఆలయ సందర్శనం ద్వారా శుభఫలితాలు లభించును.

**తులా రాశి:**
ధనాదాయం బాగుంటుంది. కుటుంబ జీవనంలో ఆశించిన సంతోషాలు లభించును. కార్యజయంలో పట్టుదల ప్రదర్శించుదురు. ఉద్యోగస్తులకు పై అధికారుల ప్రశంసలు లభించును. మతిమరపు వలన చికాకులు కలుగును. కంటి సమస్యలు మరియు మీద నొప్పి బాధించవచ్చును. వ్యాపారస్తులకు అనుకూల సమయం. ప్రయాణము వలన చికాకులు. విద్యార్థులు పై చదువులకై విదేశములకు పోవుటకు అవకాశము కలదు. 9,10 మరియు 11 వ తేదీలలో ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదావేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన: 1) నవగ్రహ ప్రదక్షిణ చేయుట 2) బుధవారంనాడు గణపతి ఆలయంలో లడ్డూ ప్రసాద వితరణ చేయుట ద్వారా శుభఫలితాలు పొందుతారు

**వృశ్చిక రాశి :**
గృహ సంబంధిత విషయాలలో అనుకూలం. ధనాదాయం బాగుండును. బంధువర్గ సహకారం లభించును. దగ్గు మరియు గొంతుకు సంబంధించిన వ్యాధులవలన బాధ కలుగును. పనులలో జాప్యం జరుగును. వ్యాపారస్తులకు అనుకూల

సమయం. ప్రయాణములవలన ఇబ్బందికి గురి అగుదురు. విదేశీ ప్రయాణము చేయువారు కడు జాగ్రత్తగా ఉండవలెను. కొత్త పరిచయాలవలన విద్యలో వెనుకబాటు కలగవచ్చును. 11,12 మరియు 13 వ తేదీలలో ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా-వేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన: 1) రామరక్షా స్తోత్రపారాయణ 2) దుర్గారాధన చేయుట ద్వారా సానుకూల ప్రయోజనం కలుగును.

**ధను రాశి :**

ఆర్థిక పరిస్థితి అనుకూలంగా ఉండును. పుణ్యక్షేత్ర సందర్శన, బంధుమిత్రులతో కాలక్షేపం, మనోవాంఛ నెరవేరుట, దూరప్రయాణముల సూచనలు కలవు. ఉద్యోగస్తులకు ఒత్తిడులు ఏర్పడును. వ్యాపారస్తుల-కు సామాన్యంగా ఉండును. కీళ్ల నొప్పులు మరియు నడుము నొప్పి వలన బాధ కలుగవచ్చును. స్త్రీలతో సమస్యలు వచ్చు అవకాశం కలదు. విద్యార్థులకు పై చదువులకై విదేశములకు వెళ్ళు అవకాశం కలదు. 13, 14 మరియు 15 వ తేదీలలో ముఖ్యమైన కార్యక్ర-మాలు వాయిదావేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన: 1) మాస శివరాత్రి నాడు రుద్రాభిషేకం జరిపించుట 2) నవగ్రహ ప్రదక్షిణ చేయుట ద్వారా శుభఫలితాలు పొందుతారు.

**మకర రాశి:**

ఈ మాసంలో ఏలినాటి శని వలన సమస్యలు, ముఖ్యంగా స్థిరాస్తి నష్టం లేదా తగాదాలు కలగవ-చ్చును. ప్రయత్నాలలో సమస్యలు మరియు పట్టు-దల లోపించును. ఆర్థిక సమస్యలతో సతమత మగుదురు. చిన్నచిన్న ఆరోగ్య సమస్యలు ఉండు ను. సకాలంలో వైద్యం వలన తగ్గుముఖం పట్టును. ఉద్యోగస్తులకు తోటివారితో వ్యతిరేకత, అనవసర మైన విషయాలవలన అశాంతి. వ్యాపారస్తులకు సామాన్యకాలం. అదనపు పెట్టుబడులు పెట్టుట తగదు. విద్యార్థులకు సామాన్యకాలం. 15,16 & 17 వ తేదీలలో ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదావే-యుట శ్రేయస్కరం.

వైదిక సూచన: 1) గురుగ్రహమునకు శాంతి జరి-పించుట 2) కనకధారా స్తోత్ర పారాయణ చేయుట ద్వారా ఉపశమనం లభించును.

**కుంభ రాశి:**

ధనాదాయం అనుకూలంగా ఉండును. చర్మ-వ్యాధులు మరియు ఆటలమ్మవారి ద్వారా కొంత చికాకు కలుగును. కుటుంబంతో తీర్థయాత్ర చేయుదురు. దూరప్రాంతంలో ఉన్నవారు స్వస్థల-మునకు పయనం అగుదురు. సంతానం కొరకు ఎదురు చూచువారికి శుభవార్త. ఉద్యోగస్తులకు నూతన భవిష్యత్ ప్రణాళికలు లభించును. పదో-న్నతి లేదా స్థలమార్పిడికి అవకాశం కలదు. వ్యా-పారస్తులకు ప్రోత్సాహకర కాలం. వ్యాపారవిస్తరణ-కు మంచి సమయం. ఇంజనీరింగ్ మరియు లా చదువు విద్యార్థులకు అనుకూలసమయం. 17,18 మరియు 19 వ తేదీలలో ముఖ్యమైన కార్యక్రమా-లు వాయిదావేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన: 1) గణపతి మూలమంత్రం జపించుట 2) సుబ్రహ్మణ్యేశ్వర ఆలయ సందర్శన ద్వారా శుభఫలితాలు కలుగును.

**మీన రాశి :**

ఆరోగ్య విషయంలో శ్రద్ధ పెట్టవలె ను. ఉదర మరియు ఊపిరి సంబంధిత సమస్య లవలన బాధ కలుగును. ఆర్థికంగా అనుకూల సమయం. వ్యాపార వ్యవహారాలు, ఉద్యోగ అన్వే షణ, మరి యు అవివాహితులకు వివాహ ప్రయత్నాలు ఫలించును. ఆప్తుల సమాగమనం. అనుకున్న రీతులలో పనులు జరుగును. నూతన ఆలోచన లు కలసివచ్చును. పుణ్యక్షేత్ర సందర్శనకు అవ కాశం. విద్యార్థులు పై చదువులకై విదే శీయాన ప్రయత్నము కష్టం మీద సఫలీకృతం కాగలదు. 19,20 & 21 వ తేదీలలో ముఖ్యమైన కార్యక్రమా-లు వాయిదావేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన: 1) ఓం నమః శివాయ మంత్రం జపించుట 2) శ్రీ లక్ష్మీనృసింహ కరావలంబ స్తోత్ర పఠనం ద్వారా ఉత్తమ ఫలితాలు కలుగును.



గట్టు
ఎత్తిపోతల
పథకం
శంకుస్థాపన
సందర్భంగా

విశాఖ రైల్వే జోన్ కోసం దీక్ష





గాన గంధర్వుడు
శ్రీ బాలమురళీకృష్ణ
జయంతి జూలై 6 న

RNI No. APTEL/2011/39497 JULY 2018 Postal No. HSE/1043/2017-19

Date of Publishing: 1st July Date of Posting: 8th July




ధ్వన్యనుకరణ సామ్రాట్ శ్రీ నేరెళ్ళ వేణుమాధవ్

(1932-2018)

Published, Edited and Printed by T.Shanti at Flat no. 45058, Janapriya Utopia, Hyderguda, Attapur, Hyderabad - 500 048, Phone: 94905 71297 / 94401 47993 email: teega51@gmail.com (www.chaitanyam.net) Printed at Planographers, 5-8-300, Chirag Ali lane, Abide, Hyderabad-500001